


నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక
Published from Jagitial
www.evarthalu.com



మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..



గురువారం THURSDAY 12-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 224 Issue: 224


12 ఫిబ్రవరి 2026 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:47 సూర్యాస్తమయం - సా. 6:12 తిథి దశమి మ. 12:20 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం జ్యేష్ఠ మ. 1:33 వరకు తరువాత మూల యోగం హర్షణ రా. 2:59ం వరకు కరణం విష్టి మ. 12:20 వరకు బవ రా. 1:26ం వరకు వర్జ్యం రా. 10:32 నుండి రా. 12:18 వరకు దుర్ముహూర్తం ఉ. 10:36 నుండి ఉ. 11:21 వరకు మ. 3:09 నుండి మ. 3:55 వరకు రాహుకాలం మ. 1:56 నుండి మ. 3:21 వరకు యమగండం ఉ. 6:47 నుండి ఉ. 8:13 వరకు గుళికాకాలం ఉ. 9:39 నుండి ఉ. 11:04 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:11 నుండి తె. 5:59 వరకు అమృత ఘడియలు లేదు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

వందే మాతరం
సుజలాం సుఫలాం మలయజశీతలాం,
శస్యశ్యామలం మాతరం!
**వందేమాతరం!**

శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం,
ఫుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీం,
సుహాసినీం సుమధుర భాషిణీం,
సుఖదాం వరదాం, మాతరమ్!
**వందే మాతరమ్!**

కోటి కోటి కంఠ కలకల నినాద కరాళే,
కోటి కోటి భుజైర్ధృత ఖరకరవాలే,
అబలా కేనో మా ఏత బలే?
బహుబల ధారిణీం, నమామి తారిణీం,
రిపుదళ వారిణీం, మాతరం!
**వందేమాతరం!**

తుమి విద్యా, తుమి ధర్మా తుమి హృది, తుమి మర్మ,
త్వం హి ప్రాణాః శరీరే!
బాహుతే తుమి మా శక్తి హృదయే తుమి మా భక్తి,
తోమరై ప్రతిమా గాడి మందిరే మందిరే,
**వందేమాతరం!**

త్వం హి దుర్గా దశప్రహరణ ధారిణీ,
కమలా కమల దళ విహారిణీ,
వాణీ విద్యాదాయినీ, నమామి త్వామ్,
నమామి కమలాం అమలాం అతులామ్,
సుజలాం సుఫలాం మాతరం
**వందేమాతరం!**

శ్యామలాం సరళాం సుస్మితాం భూషితాం,
ధరణీం భరణీం, మాతరం!
**వందేమాతరం! వందేమాతరం!**



# వందేమాతరం మొత్తం పాడాల్సిందే!

## అదీ.. జనగణమన కంటే ముందే

ప్రభుత్వ కార్యక్రమాలు, స్కూళ్లలో తప్పనిసరి
అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు
కేంద్రం కొత్త నిబంధనలు విడుదల

వందేమాతరం గీతాన్ని అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, అన్ని పాఠశాలల్లో తప్పనిసరి చేస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ బుధవారం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. జనగణమన వంటి జాతీయ గీతాల కంటే ముందు దీనిని కచ్చితంగా ఆలపించాలని ఈ నిబంధనలలో పేర్కొంది. వందేమాతర గీతం ఆలపించినప్పుడు అందరూ నిలబడాలని పేర్కొంది.

న్యూఢిల్లీ: అన్ని పురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని ఈ నిబంధనల్లో పేర్కొంది. జాతీయ గీతం, గేయం పాడుతుండగా అంతరాయం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. తాజాగా విడుదల చేసిన తరువాయి 2 వ పేజీలో...

# మున్సిపల్ పోలింగ్ 73.01%

## పోటెత్తిన పట్టణ ఓటరు.. ప్రశాంతంగా 'పుర' ఎన్నికలు

### చౌటుప్పల్‌లో 91.91 శాతం.. నందికొండలో 59.68 శాతం



రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అక్కడక్కడ చిన్న చిన్న గొడవలు మినహా.. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. సాయంత్ర ఐదు గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగియగా.. క్యూలో నిల్చున్న వారికి 7 గంటల వరకూ అవకాశం ఇచ్చారు. మొత్తం మున్సిపల్ ఎన్నికల్లో 73.01 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్)

ఏడు కార్పొరేషన్లలో 66.05 శాతం పోలింగ్ నమోదవగా.. 116 మున్సిపాలిటీల్లో 75.88 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా చౌటుప్పల్‌లో 91.91 శాతం నమోదవగా.. అత్యల్పంగా 59.68 శాతం నందికొండ మున్సిపాలిటీలో నమోదైంది. ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించడంలో పోలీసు సిబ్బంది అంకితభావంతో పాటు ఈ ఆధునిక వెబ్‌కాస్టింగ్ సాంకేతికత తరువాయి 2 వ పేజీలో...



2

# ఇటు రారా ..కొడకా

## సీఐపై జగ్గారెడ్డి అసభ్య వ్యాఖ్యలు!

కాంగ్రెస్ నేతపై కేసుకు ఈసీ ఆదేశం.. మాపైనే రిటర్న్ కేసులా?: జగ్గారెడ్డి

## పోలీసోళ్లకు ఒళ్లు బలిసిందా?

దిమాక్ కరాబైందా.. యూస్ లెస్ ఫెలో
పోలీసులపై విరుచుకుపడ్డ ఎంపీ అర్వింద్




2



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,960 |
| వెండి (గ్రాము): | రూ.300 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,224 |

# 3 కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ



## కమిషనర్ల నియామకం, ఉత్తర్వులు జారీ

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ని రాష్ట్ర ప్రభుత్వం మూడుగా విభజించింది.పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గత కొద్ది రోజులుగా ఇందుకు సంబంధించి ప్రభుత్వం కసరత్తు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 7 కార్పొరేషన్లు, 20 మునిసిపాలిటీలను విలీనం చేసింది. విలీన ప్రాంతాలతో కలిపి మొత్తం 300 డివిజన్లుగా విభజించింది.

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): అయితే మెగా జీహెచ్ఎంసీ విభజనకు సంబంధించి ఎలాంటి సాంకేతిక, చట్టపరమైన చిక్కులు రాకుండగా... ప్రస్తుత పాలకమండలి గుడువు ముగిసేవరకు ప్రభుత్వం వేచి చూసినట్టుగా తెలుస్తోంది. అయితే జీహెచ్ఎంసీ ప్రస్తుత పాలక మండలి గడువు మంగళవారంతో ముగిసింది. దీంతో జీహెచ్ఎంసీ విభజనకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీని.. జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ తరువాయి 2 వ పేజీలో...

# మూసీ భూసేకరణ షురూ


ఎంఆర్డీసీఎల్ కీలక ప్రకటన
ముందుగా గండిపేట పరిధిలో
50 ఎకరాలు సేకరణ టార్గెట్



మూసీ సుందరీకరణ కోసం కంకణం కట్టుకున్న రేవంత్ రెడ్డి సర్కార్.. ఆ దిశగా కీలక ముందడుగు వేసింది. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు సంబంధించి కీలక అప్‌డేట్‌ను అధికారులు వెల్లడించారు. మూసీ ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియను మొదలుపెట్టింది.

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): ఈ నేపథ్యంలోనే మూసీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు భూసేకరణ కోసం.. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్ డీసీఎల్) కీలక ప్రకటన చేసింది. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న వారు ఏవైనా అభ్యంతరాలు ఉంటే.. నిర్ణీత గడువులో తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఫేజ్ ఏ1 కింద.. హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు మొత్తం 9.2 కిలోమీటర్ల మేర భూ సేకరణ చేయనున్నారు. ఫేజ్ ఏ2 లో భాగంగా ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు ఉన్న 11.8 కిలోమీటర్ల భూమిని సేకరించనున్నారు. హైదరాబాద్ జిల్లా గోల్కొండ మండలం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలో ఉన్న భూముల సేకరణ కోసం తాజాగా ఎంఆర్‌డీసీఎల్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగానే సుమారు 50 ఎకరాలకు పైగా భూమిని సేకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మార్కెట్ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



టెక్సస్‌కు చెందిన ఓ వ్యాపారి.. మానసిక, శారీరక దివ్యాంగురాలైన తన కూతురి బాధను చూడలేక తన 51 మిలియన్ డాలర్ల కంపెనీని అమ్మేసి, శాన్ ఆంటోనియోలో ఒక అమ్యూజ్‌మెంట్ పార్కును కట్టాడు. శారీరక, మనో వైకల్యంతో బాధపడే ఎవరైనా సరే అక్కడికి ఉచితంగా వచ్చి ఎంజాయ్ చేయొచ్చు. వారితో పాటు వచ్చే సహాయకారులకూ ప్రవేశం ఉచితం.

# మాదే పై'చేయి'

## కాంగ్రెస్ ప్రభంజనం ఖాయం

ఓటర్లు మావైపే నిలిచారు.. టీపీపీసీ చీఫ్ మహేశ్ గౌడ్



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించనుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్ సరళిని తరువాయి 2 వ పేజీలో...

# అధికార దుర్వినియోగం

ఓటమి భయంతో దౌర్జన్యం.. రేవంత్‌కు మూల్యం తప్పదు
కాంగ్రెస్‌పై కేటీఆర్ ఫైర్.. గులాబీ సైనికులకు థ్యాంక్స్



హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): ఓటమి భయంతోనే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యకాండకు దిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (ఖు=) ఆరోపించారు. ఎక్స్ వేదికగా గురువారం ఫైర్ అయ్యారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ఘోరమైన పరిపాలనా వైఫల్యాలను మూటగట్టుకున్నదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని అరాచకాలు చేసినా వీరోచితంగా పోరాడిన గులాబీ సైనికులందరికీ పేరుపేరునా హృదయపూర్వక అభినందనలు అని తెలిపారు. ఆదిలాబాద్ -2 వ పేజీలో...



# మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
స్పష్టం చేసిన టీజీఎస్ఆర్టీసీ

2

## రాశి ఫలాలు



12.2.2026

మేషం: చేపట్టిన పనులలో శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. వృత్తి వ్యాపారాలు లాభాల బాట పడతాయి. సన్నిహితుల నుండి నూతన విషయాలు తెలుసుకుంటారు. ఉద్యోగమున అనుకూలత పెరుగుతుంది. ఆర్ధిక విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. సమాజంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.

వృషభం: ప్రముఖుల నుండి ఊహించని ఆహ్వానాలు అందుతాయి. గృహమున బంధు మిత్రుల రాకతో సందడి వాతావరణం ఉంటుంది. అనుకున్న పనులు సకాలంలో పూర్తవుతాయి. స్థిరాస్థి వృద్ధి చెందుతుంది. వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. నిరుద్యోగులు ఉద్యోగ లబ్ది పొందుతారు.

మిధునం: బంధువులతో కొన్ని విషయాల్లో మాట పట్టింపులు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. కీలక వ్యవహారాలలో అవాంతరాలు కలుగుతాయి. వృధా ఖర్చులు చేస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగస్తులు అధికారుల ఆగ్రహానికి గురవుతారు. ఋణ ప్రయత్నాలు కలసిరావు.

కర్కాటకం: దూర ప్రయాణాలలో ఇబ్బందులు కలుగుతాయి. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు కలుగుతాయి. ఆర్ధిక పరిస్థితి గందరగోళంగా ఉ ంటుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. జీవిత భాగస్వామి ఆరోగ్య విషయాల్లో శ్రద్ధ వహించాలి. ధన వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి.

సింహం: పాత మిత్రుల సహాయంతో కొన్ని వ్యవహారాలు పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. సంతాన నూతన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారాలలో స్వంత నిర్ణయాలు చెయ్యడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు.

కన్య: చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో పెట్టుబడులు సకాలంలో అందవు. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. కుటుంబ సభ్యులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగాలలో ఇతరులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. నూతన ఋణాలు చెయ్యకపోవడం మంచిది.

తుల: చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. కొన్ని వ్యవహారాలలో ఆప్తుల సలహాలు తీసుకోవడం మంచిది. ఉద్యోగస్థులకు శుభవార్తలు అందుతాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. ఉద్యోగస్తులకు పదోన్నతులు పెరుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

వృశ్చికం: దైవ సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆర్ధిక నష్టాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో అవరోధాలు కలిగిన సకాలంలో పూర్తిచేస్తారు. ఇంటా బయట పని ఒత్తిడి పెరిగి సమయానికి తగిన విశ్రాంతి ఉండదు. ప్రభుత్వ వ్యవహారాలలో విమర్శలు ఎదురవుతాయి.

ధనస్సు: ఆర్ధికంగా గందరగోళ పరిస్థితులుంటాయి. బంధు మిత్రుల ఆదరణ పెరుగుతుంది. గృహమున శు భకార్యములు నిర్వహిస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో మరింత ఉ త్సాహకర వాతావరణం ఉంటుంది. ఉద్యోగస్తులు పనితీరుతో అందరిని ఆకట్టుకుంటారు.

మకరం: సోదరులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. వ్యాపార ఉ ద్యోగాలలో సమస్యలను అధిగమించి ధైర్యంగా ముందుకు సాగుతారు.చాలాకాలంగా పూర్తి కాని పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

కుంభం: నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి. కీలక వ్యవహారాలలో కుటుంబ సభ్యులు మీ మాటతో విభేదిస్తారు. మిత్రులతో చిన్నపాటి వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి కాక నిరాశ తప్పదు.

మీనం: కుటుంబ సభ్యులతో మాట పట్టింపులుంటాయి. చేపట్టిన పనులు మరింత మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాలు ఆకస్మికంగా వాయిదా పడతాయి. వృత్తి ఉద్యోగాలలో సహోద్యోగుల ప్రవర్తన కొంత మానసిక బాధ కలిగిస్తుంది. నూతన వ్యాపారాల ప్రారంభానికి చేసే ప్రయత్నాలు విఫలమౌతాయి.

# ఇటు రారా ..... కొడకా

### సీఐపై జగ్గారెడ్డి అసభ్య వ్యాఖ్యలు!

### కాంగ్రెస్ నేతపై కేసుకు ఈసీ ఆదేశం

### మాపైనే రిటర్న్ కేసులా?: జగ్గారెడ్డి



సంగారెడ్డి, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): 'ఇటు రారా.. కొడకా. ఆ సీఐ గాడు పదేళ్ల బీఆర్ఎస్ వాళ్ల ....తాగిండు' అంటూ ఓ సీఐపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి దారుణ వ్యాఖ్యలు చేశారు. వివరాల్లోకెళితే.. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సంగారెడ్డిలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. విధుల్లో ఉన్న ఓ సీఐ.. కాంగ్రెస్ అభ్యర్థి కాలర్ పట్టుకున్నట్లు ఆరోపణలు రావడం పెను దుమారానికి కారణం అయింది. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి.. పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్ రిగ్గింగ్‌కు సీఐ సహకరిస్తున్నారని సంచలన ఆరోపణలు చేసిన జగ్గారెడ్డి.. సీఐని సస్పెండ్ చేయకపోతే.. ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరికలు చేశారు. సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 34వ వార్డు పోలింగ్ స్టేషన్ వద్ద ఈ సంఘటన చోటు చేసుకుంది. 34 వార్డులో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి పట్ల.. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ (సీఐ) కాలర్ పట్టుకున్నారని ఆరోపించిన.. జగ్గారెడ్డి పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకుని తీవ్రంగా మండిపడ్డారు. పోలింగ్ జరగకుండా ఆపేస్తామని పేర్కొంటూ బలవంతంగా బూత్‌లోకి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే ఆయనను పోలీసులు అడ్డుకోవడంతో.. అక్కడ తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. దీంతో ఆ పోలింగ్ స్టేషన్ వద్దకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలి రావడంతో అక్కడ పరిస్థితులు హీటెక్కాయి. ఈ ఘటనతో సంగారెడ్డిలో శాంతి భద్రతల సమస్య ఎదురైతే దానికి సీఐ శివకుమార్, హోంగార్డ్‌లే కారణం అని జగ్గారెడ్డి మండిపడ్డారు. అయితే, జగ్గారెడ్డి వ్యాఖ్యలపై ఎన్నికల సంఘం సీరియస్ అయింది. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసి, రిపోర్టు ఇవ్వాలని జిల్లా ఎస్పీని ఆదేశించింది. ఓటర్ల మనోభావాలను దెబ్బతీసే విధంగా జగ్గారెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయని రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలపై జగ్గారెడ్డి స్పందిస్తూ... దొంగ ఓటు వేసేవారిని అడ్డుకునేందుకు తమపై కేసులు పెట్టాలని ఎన్నికల సంఘం ఆదేశాలు ఇవ్వడం సరైనదేనా? అని ప్రశ్నించారు. గతంలో ఇతర ప్రాంతాల నుంచి ఓటర్లను తీసుకొచ్చి, సంగారెడ్డిలో ఓటర్లుగా నమోదు చేశారని ఆరోపించారు. దొంగ ఓట్లు వేస్తున్నవారిని కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారని చెప్పారు. అయితే సీఐ శివకుమార్ కాంగ్రెస్ నేత కాలర్ పట్టుకున్నారని, దీంతో తాను అక్కడికి వెళ్లానని, ఈ క్రమంలో వాగ్వాదం చోటుచేసుకుందని తెలిపారు.



# పోలీసోళ్లకు ఒళ్లు బలిసిందా?

### దిమాక్ కరాబైందా.. యూస్ లెస్ ఫెలో

### పోలీసులపై విరుచుకుపడ్డ ఎంపీ అర్వింద్

నిజామాబాద్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): ఒక పోలింగ్ కేంద్రం నుంచి అభ్యర్థిని బయటకు ఎలా పంపుతారు పోలీసోళ్లకు ఒళ్ళు బలిసిందా? దిమా కిట్ల కరాబ్ అయిందా? యూస్ లెస్ ఫెలో అంటూ పోలీసుపై ఎంపీ ధర్మపురి అర్వింద్ మాటలతో విరుచుకుపడ్డారు. వివరాల్లోకెళితే.. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా నిజా మాబాద్ నగరంలోని 34వ డివిజన్ హరిచరణ్ మార్వాడి పోలింగ్ కేంద్రం లో అనూహ్య ఘటన చోటుచేసు కుంది. హరి చరణ్ మార్వాడి పోలింగ్ కేంద్రంలో పోలింగ్ కేంద్రం లో అభ్యర్థిని కేంద్రం నుం చి బయటకు పంపుతున్నారని, అదే విధంగా పోలింగ్ కేంద్రంలో ఒకరి ఓటు మరొకరు వేస్తున్నారని అభ్యర్థి ఆరోపణ మేరకు సమాచారం తెలుసుకు న్న ఎంపీ ధర్మపురి అర్వింద్.. హరిచరణ్ మార్వాడీ పోలింగ్ కేంద్రానికి బుధవారం మధ్యాహ్నం చేరుకొని పోలీసులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోలింగ్ కేంద్రం నుంచి అభ్యర్థిని బయటకు ఎలా పంపుతారని అక్కడే ఉన్న పోలీసుతో ఎంపీ మండిపడ్డారు. సాయంత్రం 5 గంటల వరకు ఇక్కడే ఉంటారు.. అతడిని పంపితే ఊరుకోబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసోళ్ల చేత కానితనంతోనే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీసుతో అన్నారు. ఒకవేళ నిన్ను ఎవరైనా బయటకు పంపితే.. పోలీసోడైనా సరే తన్నుకుంటా తీసుకురా.. అన్న ఎంపీ వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపాయి. అభ్యర్థితో పాటు ఎంపీ పోలింగ్ కేంద్రంలో లోపలి కి వెళ్లి విధులు నిర్వర్తి స్తున్న ఉద్యోగితో ఎంపీ మాట్లాడారు .. నీకు ఎంత ధైర్యం ఉంటే... అభ్యర్థిని బయటకు పంపు తావు సదరు ఉద్యోగిని ప్రశ్నించారు. ఇక్కడ తప్పు జరుగుతుందని అభ్యర్థి మీకు కంప్లైంట్ చేస్తే మీరు ఏం చేస్తున్నారు. సరి చేయాల్సిన బాధ్యత మీది కాదా? అని ఎంపీ సదరు ఉద్యోగిని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరి ముఖం చూపించాకే ఓటు వేయించాలని విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు గట్టిగా చెప్పారు.

# మున్సిపల్ పోలింగ్ 73.01%

**మొదటి పేజీ తరువాయి**

ఎంతగానో తోడ్పడిందని డీజీపీ శివధర్ రెడ్డి ప్రశంసించారు. ఈ ఎన్నికల కోసం పోలీసులు అత్యంత పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేశారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,203 పోలింగ్ స్టేషన్లను కవర్ చేస్తూ భారీ ఎత్తున భద్రతను కల్పించామన్నారు. 1,302 అత్యంత సమస్యాత్మక (హైపర్ సెన్సిటివ్), 1,926 సమస్యాత్మక (సెన్సిటివ్) మరియు 4,975 సాధారణ కేంద్రాలుగా గుర్తించి, ఆయా ప్రాంతాల తీవ్రతను బట్టి బలగాలను మోహరించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వృద్ధులు ఓట్లు వేసేందుకు పోలీస్ సిబ్బంది సహాయం చేశారని పేర్కొన్నారు.



# మూసీ భూసేకరణ షురూ

**మొదటి పేజీ తరువాయి**

విలువ ఆధారంగా భూమిని ఇచ్చే యజమానులకు పరిహారం ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందులో భాగంగానే వారి భూమి పట్టాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్లకు సంబంధించిన వివరాలను ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది. ఇక అభ్యంతరాల కోసం గడువు ప్రకటించిన ప్రభుత్వం.. ఆలోగా ఏదైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే ఆయా భూముల సర్వే నంబర్లు.. గ్రామాల వారీగా పూర్తి లిస్ట్‌ను విడుదల చేసింది. భూ సేకరణ చట్టం-2013 నిబంధనల ప్రకారం ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను చేపట్టనుంది. మొత్తం 4 జిల్లాల పరిధిలో భూసేకరణ చేపట్టనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మూసీ డెవలప్‌మెంట్ పనులు చేపట్టనున్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల పరిధిలో.. 14 మండలాల్లోని మొత్తం 46 గ్రామాల్లో పలు దశల వారీగా మూసీ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు.

# వందేమాతరం మొత్తం పాడాల్సిందే!

**మొదటి పేజీ తరువాయి**

నిబంధనల కింద బాధ్యులకు గరిష్ఠంగా మూడేళ్ళ జైలు శిక్ష విధించనున్నట్లు స్పష్టం చేసింది. సినిమా హాల్స్ వంటి ప్రదేశాల్లో కూడా దీనిని తప్పనిసరి చేసింది. ఈ సందర్భాల్లో నిలబడటాన్ని తప్పనిసరి చేయలేదు. కేంద్ర ప్రభుత్వం వందేమాతరం 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈ కొత్త నిబంధనలను విడుదల చేసింది. 1937లో తొలగించిన నాలుగు చరణాలతో కలిపి మొత్తం ఆరు చరణాలను పాడాలని కేంద్రం వెల్లడించింది. స్వాతంత్ర పోరాట సమయంలో ముస్లిం లీగ్ అభ్యంతరాల మేరకు నాలుగు చరణాలను తొలగించిన కాంగ్రెస్, రెండు చరణాలను స్వీకరించింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం రెండు చరణాలతోనే వందేమాతరంను జాతీయ గేయంగా ప్రకటించింది.

# అధికార దుర్వినియోగం

**మొదటి పేజీ తరువాయి**

నుంచి ఆలంపూర్ వరకూ పురపాలక సమరంలో మీరు కనబరిచిన పోరాట స్ఫూర్తి బీఆర్ఎస్ కు కొండంత బలాన్నిచ్చింది, పార్టీలో ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో మొదలైన పరాభవం, పట్టణాల్లోనూ తప్పదనే ఆందోళనతోనే అడుగడుగునా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. అక్రమంగా లూటీచేసిన వేలకోట్ల ప్రజాధనంతో, ప్రజాతీర్పునే మార్చాలన్న ఈ కుట్రలను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని కేటీఆర్ అన్నారు. పోలీసుశాఖను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులపై సాగించిన వేధింపుల పర్వానికి, దాడులకు రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ప్రజలకిచ్చిన హామీలను, మొత్తంగా పరిపాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన పాపం రేవంత్ రెడ్డిని ప్రతినిత్యం వెంటాడుతూనే ఉంటదన్నారు. అంతకుముందు హరీశ్ రావు సైతం కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదలుకొని మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ శ్రేణులు అడుగడుగునా ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కారని ఆరోపించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పోలింగ్ ముగిసే వరకు కాంగ్రెస్ అరాచకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని హరీష్ రావు విమర్శించారు. ఎన్నికల్లో విజయం సాధించడం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజల తీర్పును మార్చలేరని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# మాదే పై'చేయి'

**మొదటి పేజీ తరువాయి**

గమనిస్తే అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలో నిలవబోతోందని మహేశ్ గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా పాలనకు, సంక్షేమ పథకాలకు పట్టణ ఓటర్లు మద్దతు పలికారని ఆయన వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో పూర్తి సంతృప్తి ఉందని, ఈ ఫలితాలతో అది నిరూపితమవుతుందని తెలిపారు. ఆరు గ్యారంటీల అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ప్రజల ఆదరణ చూరగొన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం సానుకూల ఫలితాలను ఇస్తుందని చెప్పారు. ఎన్నికల్లో గెలుపు కోసం శ్రమించిన ప్రతి కార్యకర్తకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

### మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. స్పష్టం చేసిన టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): తెలంగాణలోని ప్రజలకు మహాశివరాత్రి సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ గుడ్ న్యూస్ తెలిపింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులను నడపాలని నిర్ణయించింది. ఈ మేరకు టీజీఎస్ఆర్టీసీ ఓ ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 43 శైవక్షేత్రాలకు పలు ప్రాంతాలలో 2,243 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు పేర్కొంది. ఫిబ్రవరి 15న మహాశివరాత్రి కావడంతో ఫిబ్రవరి 14 నుంచి 16వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు టీజీఎస్ఆర్టీసీ ప్రకటనలో పేర్కంది. శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71తో పాటు రాష్ట్రంలోని కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు టీజీఎస్ఆర్టీసీ పేర్కొంది. భక్తులు వెళ్లే శైవ క్షేత్రాలకు సంబంధించి బస్సులను బస్సు డిపోలలో అందుబాటులో ఉంచబోతున్నట్లు టీజీఎస్ఆర్టీసీ పేర్కొంది. ఇకపోతే శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు హైదరాబాద్[illegible]లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్[illegible]బీ, బీహెచ్ఈఎల్ నుంచి ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయని టీజీఎస్ఆర్టీసీ తెలిపింది. ఈ మేరకు శివరాత్రి ఆపరేషన్స్ పై ఉన్నతాధికారులతో సంస్థ వీసీ ఒ ఎండీ వై.నాగిరెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. శివరాత్రి పండుగకు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై నాగిరెడ్డి అధికారులను ఆదేశించారు. గత శివరాత్రి కన్నా ఈ సారి 208 బస్సులను అదనంగా సంస్థ నడపనుంది. భక్తుల రద్దీని దృష్టిలో పెంచుకుని అవసరమైతే మరిన్ని ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై నాగిరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను స్వల్పంగా పెంచింది టీజీఎస్ఆర్టీసీ. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్[illegible]లో టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదని ఈ నెల 14 నుంచి 16 తేదీ వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమలవుతాయని పేర్కొంది. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15 వ తేదీ నుంచి 17 తేదీ వరకు(మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయని తెలిపింది. మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు రాష్ట్రంలో ప్రయాణానికి ఉచిత బస్సు రవాణా సదుపాయం యధావిధిగా అమల్లో ఉంటుందని తెలిపింది.అయితే మహిళా ప్రయాణికులు ప్రయాణం చేసేటప్పుడు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని సూచించారు. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను ఏర్పాటు చేస్తామని టీజీఎస్ఆర్టీసీ పేర్కొంది. హైదరాబాద్ నుంచి శ్రీశైలంకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై నాగిరెడ్డి తెలిపారు. టికెట్ల బుకింగ్ ను ఌఌ.ౡంఠీఒఎబం.అఅ వెబ్ సైట్ లో బుక్ చేసుకోవచ్చని, మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033లలో సంప్రదించాలని సూచించారు.

# 3 కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ

**మొదటి పేజీ తరువాయి**

కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)గా విభజించింది. ఈ మూడు మున్సిపల్ కార్పొరేషన్లకు కమిషనర్లను నియమించింది. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించి ఉన్న ప్రాంతం మొత్తం.. ఈ 3 కార్పొరేషన్ల పరిధిలో ఉంటుంది. జీహెచ్ఎంసీ చట్టం-1955, సెక్షన్-3(1) ప్రకారం జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీని ఏర్పాటు చేసింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లు ఉంటాయి. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్‌బీ నగర్ జోన్‌లు ఉంటాయి. పునర్నిర్మించబడిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పుడు శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్‌లు ఉన్నాయి. ఇక, ఆర్‌వీ కర్ణన్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పదవిలో కొనసాగుతారని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా ఉన్న శ్రీజనను బదిలీ చేసి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, అలాగే, జీహెచ్ఎంసీ మరో అదనపు కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని బదిలీ చేసి మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించింది. ప్రస్తుతం మూడు కార్పొరేషన్లను పర్యవేక్షించే ప్రత్యేక అధికారిగా జయేశ్ రంజన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

# జీహెచ్ఎంసీ విభజనను వ్యతిరేకిస్తున్నాం

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): మజ్లిస్ పార్టీ ఒత్తిడి, కాంగ్రెస్ పార్టీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం రాజేంద్రనగర్, మహేశ్వరం వంటి ప్రాంతాల్లోని మజ్లిస్ ఆధిపత్యం కలిగిన ప్రాంతాలను కోర్ జీహెచ్ఎంసీలో చేర్చారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇప్పటికే కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్న పరిస్థితిలో ఇది మరింత భారమవుతుందన్నారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జీహెచ్ఎంసీ విభజనపై ఎటువంటి అభిప్రాయ సేకరణ చేయకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారు. జనాభా లెక్కలకు సంబంధించిన నోటిఫికేషన్ వచ్చిన తర్వాత రెవెన్యూ గ్రామాలు, వార్డుల విభజన చేయకూడదని దేశవ్యాప్తంగా రాజ్యాంగబద్ధంగా నోటిఫికేషన్ ఇచ్చారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గజ్వేల్, నల్లగొండ, హైదరాబాద్ కార్పొరేషన్లను విభజించింది. ఇది పూర్తిగా చట్టవ్యతిరేక నిర్ణయం. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి పేర్లతో కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, 300 వార్డులు, 60 సర్కిళ్లతో నగర పాలన పునర్వ్యవస్థీకరణ చేశారు. 31 డిసెంబర్ 2025 తర్వాత ఎలాంటి మార్పులు చేయరాదని, అవసరమైతే మే 2027 వరకు వేచి చూడాలని సెన్సస్ డైరెక్టరేట్ స్పష్టంగా పేర్కొనట్లు తెలిపారు. అయిన రాష్ట్ర ప్రభుత్వం ఆ మార్గదర్శకాలను ఉల్లంఘించి ఓఆర్ఆర్‌ను సరిహద్దుగా తీసుకుంటామని చెప్పినా, కొన్ని ప్రాంతాలు ఓఆర్ఆర్ బయట, మరికొన్ని లోపల ఉంచడం జరిగింది. ఎయిర్‌పోర్టు, బీహెచ్ఈఎల్, ఇక్రిసాట్ వంటి కీలక ప్రాంతాలను జీహెచ్ఎంసీ పరిధి నుంచి మినహాయించింది. రాష్ట్రానికి జీహెచ్ఎంసీ పరిధి నుంచే సుమారు 70 శాతం ఆదాయం వస్తోంది. వాటర్ వర్క్స్ సంస్థలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆర్–ఆర్ ట్యాక్స్ పేరుతో అధిక వసూళ్లకు పాల్పడుతోందని విమర్శించారు. ఎన్‌వోసీలు, ల్యాండ్ పర్మిషన్లు, భూముల రిజిస్ట్రేషన్లు, ల్యాండ్ డాక్యుమెంటేషన్ వంటి మార్పుల కోసం కూడా తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ నాయకులకు ఆర్–ఆర్ ట్యాక్స్ చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం బెంగళూరులో ఆర్–ఆర్ ట్యాక్స్ 12 శాతం వసూలు చేస్తే, తెలంగాణలో 30 శాతం వరకు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు మూసీ ప్రక్షాళన చేస్తామని కాంగ్రెస్ చెబుతోందని తాము కూడా మూసీ శుద్ధి కోరుకుంటున్నామన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీల్లో సరైన వసతులే లేవు, 50 శాతం సిబ్బంది కొరత ఉంది, సానిటేషన్ తూతూమంత్రంగా జరుగుతోంది. ఆదాయం మాత్రం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటోంది. ఆర్–ఆర్ ట్యాక్స్ వసూళ్లు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. మున్సిపల్‌ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు అత్యంత దుర్మార్గంగా ఉందని ఇది మక్తలికే పరిమితం కాలేదు. తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ ఇదే విధానాన్ని అనుసరించిందన్నారు. బహిరంగంగా, పోలీసుల సమక్షంలోనే, పోలింగ్ బూత్‌ల లోపల బయటా విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేసింది. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషన్, పోలీసుల నుంచి ఎలాంటి స్పందన లేదు. రాష్ట్రంలో స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఉన్నదా అనే అనుమానం కలుగుతోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ డబ్బు రాజకీయాలనే నమ్ముకుని ఎన్నికల్లో పాల్గొన్నాయి. ప్రజల్లో ప్రచారానికి వెళ్లినప్పుడు కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత, బీఆర్ఎస్‌పై ఆదరణ లేకపోవడం స్పష్టంగా కనిపించడంతో, చివరికి డబ్బు, దౌర్జన్యాల ఆధారంగా ఎన్నికలను ప్రభావితం చేయాలని ప్రయత్నించినట్లు పేర్కొన్నారు.






## తెలుగులో వాదనలు కుదరదు: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): ఖమ్మం జిల్లాలో ఒక కాంట్రాక్టర్‌కు ఏకంగా 22కుపైగా కాంట్రాక్ట్‌లు ఇవ్వడం వెనుక అవినీతి ఉన్నదంటూ పిటిషనర్ దాఖలు చేసిన పిల్ తెలుగులో వాదించేందుకు హైకోర్టు నిరాకరించింది. తెలుగులో వాదించడం సరికాదని పేర్కొన్నది. నాలుగు వారాల్లోగా న్యాయవాదిని నియమించుకోవాలని పిటిషనర్‌కు సూచించింది. కోర్టు కేసుల విచారణ ప్రక్రియ ఇంగ్లిషులో కొనసాగించాలనే నిబంధన ఉన్నదని గుర్తుచేసింది. ఖమ్మం జిల్లాకు చెందిన ఎంఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు 22కుపైగా కాంట్రాక్ట్‌లు ఇచ్చిన పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ 2020లో ఖమ్మం జిల్లా సీతారాంపురానికి చెందిన తుమ్మలపల్లి రాంబాబు పార్టీ ఇన్‌పర్సన్‌గా పిల్ దాఖలు చేయగా, హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన బెంచ్ బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తెలుగులో వాదనలు వినిపిస్తూ సమాచార హకు చట్టం కింద కాంట్రాక్టర్‌కు చెందిన అక్రమాలపై సమాచారంతో పిల్ వేసినట్టు చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, ఇంగ్లిషులో వాదించాలని కోరింది. లేనిపక్షంలో న్యాయవాదిని నియమించుకోవాలని, ఒకవేళ నియమించుకోలేకపోతే న్యాయసేవాధికార సంస్థ ద్వారా తగిన ఏర్పాటు చేసుకోవాలని సూచించింది.



## దద్దమ్మ ప్రభుత్వం

**పొంగులేటి వ్యాఖ్యలే నిదర్శనం**

**మాజీమంత్రి జగదీశ్ రెడ్డి ఎద్దేవా**

సూర్యాపేట, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): తన ఫోన్‌ను బీఆర్ఎస్ నాయకులు ట్యాపింగ్ చేస్తున్నారని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించడం సిగ్గుచేటని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం సూర్యాపేటలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్నది వారేనని అయినా హోం మంత్రి చేతకానితనమే దీనికి నిదర్శనమా అని ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఉండి కూడా ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని అనడం హాస్యాస్పదమని జగదీశ్ రెడ్డి ఎద్దేవా చేశారు. మా ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని మంత్రి పొంగులేటి అనడం అంటే తమది దద్దమ్మ ప్రభుత్వం అని వారు ఒప్పుకున్నట్లేనని, రాష్ట్రంలో పోలీసింగ్ లేదని, ప్రభుత్వం చేతగాని స్థితిలో ఉందని వారి మాటల్లోనే తేటతెల్లమవుతోందని విమర్శించారు. హోం మంత్రిగా ఉన్న వ్యక్తి విఫలమయ్యారని మంత్రులే పరోక్షంగా ఒప్పుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. పోలీసులను కాంగ్రెస్ కార్యకర్తలుగా మార్చేశారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థకు స్వేచ్ఛ లేకుండా పోయిందని జగదీశ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులను కాంగ్రెస్ కార్యకర్తల్లా వాడుకుంటూ బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేయిస్తున్నారని, బీఆర్ఎస్ ఫోన్ల ట్యాపింగ్ చేస్తోందనేదనేది కేవలం అపోహ మాత్రమేనని, నిజానికి మంత్రుల ఫోన్లను కూడా ఈ ప్రభుత్వం ట్యాప్ చేస్తోందని మేము మొదటి నుంచీ చెబుతూనే ఉన్నామన్నారు. నిజంగా ట్యాపింగ్ జరుగుతుంటే, అది ఎవరో తేల్చే ధైర్యం ఈ ప్రభుత్వానికి ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో సహకరించాలని ఉద్యోగులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించడం వారి బలహీనతకు నిదర్శనమన్నారు. ప్రజల్లో ఆదరణ లేక ఇప్పుడు ఉద్యోగుల వద్దకు కాళ్ల బేరానికి వెళ్తున్నారని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని దాడులు చేసినా రాబోయేది మళ్లీ కేసీఆర్ రాజ్యమే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మున్సిపల్ 'హస్త'గతం!?

**70 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌దే గెలుపు?.. పలు ఎగ్జిట్ పోల్స్ అంచనా.. 13న వెలువడనున్న అధికారిక ఫలితాలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): తెలంగాణలో బుధవారం ముగిసిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించనుందని పలు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఈ ఎన్నికల పోలింగ్ అనంతరం విడుదలైన సర్వేలన్నీ కాంగ్రెస్‌కే పట్టం కట్టాయి. ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఓటర్లను ఆకట్టుకోవడంలో విఫలమైనట్లు ఈ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. వివిధ సర్వే సంస్థల అంచనాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీ దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం కాంగ్రెస్ 68 నుంచి 76 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటుందని వెల్లడించగా, బీకాన్ సర్వే ఏకంగా 80–85 పీఠాలు గెలుచుకుంటుందని పేర్కొంది. ఇదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ 8 నుంచి 36 స్థానాలకు, బీజేపీ 3 నుంచి 6 స్థానాలకు పరిమితం కావచ్చని ఈ సర్వేలు అంచనా వేశాయి. వార్డుల వారీగా చూస్తే, ఆపరేషన్ చాణక్య సర్వే మరింత లోతైన విశ్లేషణ అందించింది. మొత్తం మున్సిపల్ వార్డుల్లో కాంగ్రెస్‌కు 1400–1449 వార్డులు (48% ఓట్లు), బీఆర్ఎస్‌కు 745–793 వార్డులు (26% ఓట్లు), బీజేపీకి 358–399 వార్డులు (13% ఓట్లు) దక్కే అవకాశం ఉందని తెలిపింది. ఆశ్చర్యకరంగా జనసేన పార్టీ 30–35 వార్డులు గెలుచుకునే అవకాశం ఉందని పేర్కొనడం గమనార్హం.




ఇక 7 మున్సిపల్ కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ హవా స్పష్టంగా కనిపిస్తోంది. అయితే, ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో బీజేపీ ఆధిక్యం ప్రదర్శించవచ్చని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. మహబూబ్‌నగర్, మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లలో కాంగ్రెస్ ఏకపక్ష విజయం సాధిస్తుందని తెలిపింది. కొత్తగూడెంలో కాంగ్రెస్‌కు, సీపీఐకి మధ్య గట్టిపోటీ ఉండగా, బీఆర్ఎస్ మూడో స్థానానికే పరిమితం కావచ్చని సర్వేలు చెబుతున్నాయి. సామాజిక వర్గాల వారీగా ఎస్సీ, ముస్లిం మైనారిటీ ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. మొత్తం మీద, ఈ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమైతే తెలంగాణ పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ తన పట్టును మరింత బలోపేతం చేసుకున్నట్లే. అయితే ఇవి కేవలం అంచనాలు మాత్రమేనని, అసలు ఫలితాలు ఫిబ్రవరి 13న జరిగే ఓట్ల లెక్కింపు తర్వాతే వెల్లడవుతాయి. ఈ ఫలితాలపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# వెయ్యి కోట్ల భూములు భద్రం

**ప్రభుత్వ భూములను కాపాడిన హైడ్రా**

**జూబ్లీహిల్స్‌లో 3 కోట్ల పార్కు స్థలం స్వాధీనం**


హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): హైదరాబాద్ మహానగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములపై కన్నేసిన కబ్జాకోరులపై 'హైడ్రా' ఉక్కుపాదం మోపుతోంది. నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతాలైన జూబ్లీహిల్స్, ఖానామెట్‌లలో జరిగిన రెండు వేర్వేరు కబ్జా యత్నాలను భగ్నం చేసింది. ఈ చర్యల ద్వారా సుమారు రూ. 1,003 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడినట్లు అధికారులు తెలిపారు. హైడ్రా ప్రజావాణికి అందిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో అధికారులు బుధవారం ఈ చర్యలు చేపట్టారు. జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రి ఔట్ గేట్‌కు ఎదురుగా ఉన్న దాదాపు 2 ఎకరాల పార్కు స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకునే ప్రయత్నం చేశాడు. అక్కడ ఓ ఇంటిని అద్దెకు తీసుకుని లేడీస్ హాస్టల్ నడుపుతున్న సదరు వ్యక్తి, పార్కుకు చెందిన 150 గజాల స్థలంపై కన్నేశాడు. సుమారు 50 గజాల మేర పార్కులోకి చొచ్చుకెళ్లి పాత భవనానికి ఆనుకుని మూడు అంతస్తుల అక్రమ నిర్మాణం చేపట్టాడు. మరో 100 గజాల స్థలాన్ని తన సొంత పార్కుగా మార్చుకుని ఫార్మ్ హౌస్ తరహాలో వాడుకుంటున్నాడు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా బృందాలు



క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపాయి. కబ్జా నిజమేనని నిర్ధారించుకుని బుధవారం మూడు అంతస్తుల అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. సుమారు రూ.3 కోట్ల విలువైన ఆ పార్కు స్థలానికి ఫెన్సింగ్ వేసి రక్షణ కల్పించారు. కబ్జాకు పాల్పడిన వ్యక్తిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఖానామెట్‌లో రూ.1000 కోట్ల భూమికి రక్షణ మరో ఘటనలో, హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమీపంలోని ఖానామెట్‌లో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. గతంలో ఈ భూమిని ప్రభుత్వం ఆల్ ఇండియా వెలమ సంఘానికి కేటాయించింది. అయితే, కుల సంఘాలకు భూముల కేటాయింపుపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు స్టే విధించింది. ఇదే అదనుగా కొందరు స్థానికులు వెనుక వైపు నుంచి మట్టి పోస్తూ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. దీనిపై సంఘం ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కోర్టు తీర్పు వెలువడే వరకు భూమిని కాపాడాలని కోరారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు, సుమారు రూ.1000 కోట్ల విలువైన ఈ 5 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ విధంగా ప్రజావాణి ద్వారా అందిన సమాచారంతో హైడ్రా అధికారులు సకాలంలో స్పందించి వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులను కాపాడారు.

# నేడు భారత్ బంద్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు) దేశవ్యాప్తంగా గురువారం భారత్ బంద్(సార్వత్రిక సమ్మె) జరగనుంది. ప్రధానంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు అయిన సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్ వంటి సంస్థలు, రైతు సంఘాలు ఈ బంద్ కు పిలుపునిచ్చాయి. సుమారు 30 కోట్ల మంది ఈ బంద్‌లో పాల్గొనవచ్చని అంచనా వేస్తున్నారు. కార్మికులు, రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలనే ఉద్దేశంతో ఈ ఆందోళన నిర్వహిస్తున్నారు. ఈ బంద్‌కు ముఖ్య కారణాల్లో ఒకటి.. కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్. ఈ కొత్త లేబర్ చట్టాలు కార్మికుల హక్కులను తొలగిస్తున్నాయని, ఉద్యోగ భద్రత తగ్గుతుందని యూనియన్లు ఆరోపిస్తున్నాయి. అలాగే భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం వల్ల భారతీయ రైతులకు నష్టం కలుగుతుందని, ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌పై ప్రభావం పడుతుందని రైతు సంఘాలు చెబుతున్నాయి. అదనంగా ఎమ్మెస్పీకి చట్టబద్ధ హామీ, ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ బిల్ ఉపసంహరణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకత, వేతనాల పెంపు వంటి డిమాండ్లు కూడా ఉన్నాయి. బంద్ కారణంగా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సేవలైన రోడ్డు, రైలు రవాణా సర్వీసులు కొన్ని ప్రాంతాల్లో నిలిచిపోవచ్చు. ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ సెక్టర్ బ్యాంకులు, కొన్ని మార్కెట్లు మూసివేయబడే అవకాశం ఉంది. స్కూళ్లు, కాలేజీలు అధికారికంగా సెలవు ప్రకటించకపోయినా.. బస్సులు నిలిచిపోతే అవి కూడా తెరుచుకోకపోవచ్చు. ఆసుపత్రులు, అంబులెన్స్, ఫైర్ సర్వీసులు వంటి అత్యవసర సేవలు కొనసాగుతాయి. ప్రైవేట్ ఆఫీసులు, ఐటీ కంపెనీలు సాధారణంగానే పని చేసే అవకాశం ఉంది.



## కూల్చివేతలు మీ ఇష్టమా?

**ఏకపక్షంగా కూల్చే అధికారం ఎవరిచ్చారు?**

**హైడ్రా తీరుపై మరోసారి హైకోర్టు ఆగ్రహం**

హైదరాబాద్, ఫిబ్రవరి11 (ఈవార్తలు) : హైడ్రా తీరుపై హైకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులో కేసు విచారణలో ఉన్న జాగలోని నిర్మాణాన్ని అక్రమంటూ ఎలా కూల్చుతారని, ఏ అధికారంతో ఆ నిర్మాణాన్ని తొలగించారని ప్రశ్నించింది. ఎలాంటి అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా ఏకపక్ష నిర్ణయాలు ఎలా తీసుకుంటారని నిలదీసింది. ప్రభుత్వ ఉత్తర్వులు, మున్సిపల్ శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని హైడ్రాను ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం నార్సింగిలో 10 నుంచి 303, 306 నుంచి 311, 313 నుంచి 315 సర్వే నంబర్లలో 1,608 చదరపు గజాల స్థలాలకు ఉన్న ప్రహరీని కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ 8 మంది దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ బుధవారం ఈ ఆదేశాలు జారీచేశారు. ఆ ప్రహరీ గోడను కూల్చాక ఏర్పాటు చేసిన కంచెను 48 గంటల్లోగా తొలగించాలని హైడ్రాకు స్పష్టం చేసింది. అకడ హైడ్రా ఏర్పాటు చేసిన బోర్డును మాత్రం యథాతథంగా ఉంచవచ్చని పేర్కొం టూ.. తదుపరి విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది.

## లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే భారీ జరిమానా

**హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ హెచ్చరిక**

మార్చి 1 నుంచి నిరంతరాయంగా స్పెషల్ డ్రైవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): డ్రైవింగ్ లెసెన్స్ లేకున్నా బైక్ పై దూసుకెళుతున్నారా.. మైనర్లు, లైసెన్స్ లేని వారికి వాహనం ఇచ్చి పంపిస్తున్నారా.. ఇకపై ఇలా కుదరదని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. లైసెన్స్ లేకుండా వాహనంతో రోడ్డెక్కారంటే



భారీ జరిమానా చెల్లించాల్సి వస్తుందని, కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపే వారి వల్లే రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం చోటుచేసుకుంటున్నాయని, దీనిని నివారించేందుకు తనిఖీలు చేపట్టనున్నామని వివరించారు. మార్చి 1 నుంచి నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరంతరం 'స్పెషల్ డ్రైవ్' చేపట్టబోతున్నట్లు తెలిపారు. తనిఖీలలో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వెంటనే ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, ఆ తర్వాతే వాహనం నడపాలని హితవు పలికారు. వాహనం నడుపుతూ బయటకు వస్తే తప్పనిసరిగా ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలని సూచిస్తున్నారు. లైసెన్స్ లేని వ్యక్తులకు వాహనం ఇవ్వొద్దని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. వాహనం నడిపే అర్హత లేని వారికి వాహనాలు ఇవ్వడం నేరమని చెబుతున్నారు. మీ వాహనంతో వారు ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటే ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి ఎలాంటి పరిహారం రాదని గుర్తుచేశారు. దీనివల్ల ఆర్థిక భారంతో పాటు కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని చెప్పారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసులకు సహకరించాలని కోరుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ చలాన్ లను తప్పించుకోవడానికి కొంతమంది తమ వాహనం నంబర్ ప్లేట్ ను ట్యాంపర్ చేస్తున్నారని పోలీసులు గుర్తించారు. అంకెలు మార్చడం, నంబరు ప్లేటుకు మాస్కులు తగిలించడం, రంగు పూయడం వంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

## పలువురు సీనియర్ ఐఏఎస్‌ల బదిలీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. తాజాగా విడుదలైన అధికారిక ఉత్తర్వుల ప్రకారం పలు ప్రధాన శాఖల్లో ఉన్నతాధికారుల మార్పులు చేపట్టింది. ఈ బదిలీలు రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులకు దారి తీసే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. బదిలీ అయిన అధికారుల వివరాలు.. సింగరేణి సీఎండీగా డా. జ్యోతి బుద్ధప్రకాశ్, ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్‌ను నియమించారు. గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్ కొనసాగనున్నారు. టీజీఆర్ఏసీ డీజీగా సందీప్ కుమార్ సుల్తానియాను నియమించగా, పంచాయతీరాజ్ కమిషనర్‌గా దివ్య దేవరాజన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా కాత్యాయనీ దేవి నియమితులయ్యారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జేఎండీగా కాత్యాయనీ దేవికి అదనపు బాధ్యతలు కేటాయించారు. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ జాయింట్ ఎండీగా మయాంక్ మిట్టల్‌ను నియమించారు. ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ స్పెషల్ సీఎస్‌గా రఘురాం శర్మకు బాధ్యతలు అప్పగించారు. అలాగే, మంత్రి శ్రీధర్‌బాబు ఓఎస్డీగా అదనపు బాధ్యతల్లో రఘురాం శర్మ కొనసాగనున్నారు.



## నాన్ కేడర్ ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): జీహెచ్ఎంసీని రాష్ట్ర ప్రభుత్వం మూడు ముక్కలుగా విడగొట్టిన నేపథ్యంలో జలమండలిలో మూడు కార్పొరేషన్లకు సంబంధించి వేర్వేరు ఈడీలుగా నియమించారు. ఇప్పటివరకు జలమండలి ఈడీగా ఉన్న ఐఏఎస్ మయాంక్ మిట్టల్‌కు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో మల్కాజిగిరి కార్పొరేషన్‌కు సంబంధించి జలమండలి ఈడీగా పంకజను నియమించారు. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి జలమండలి ఈడీగా సామ్రాట్ అశోక్ నామాకు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే సైబరాబాద్‌కు సంబంధించి జలమండలి ఈడీగా రంగారెడ్డి రిజిస్ట్రార్‌గా ఉన్న సంతోశ్‌లను కూడా జలమండలి ఈడీలుగా నియమించారు. అలాగే ఉపాధి శిక్షణ శాఖ సహాయ సంచాలకుడిగా ఉన్న శశికిరణాచారిని లోక్ భవన్ జాయింట్ సెక్రటరీగా బదిలీ చేశారు.

# సీట్లో కూర్చుంటేనే అటెండెన్స్!

**ఏపీ అసెంబ్లీలో నేటి నుంచి కొత్త టెక్నాలజీ**

అమరావతి, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ శాసనసభలో గురువారం నుంచి సరికొత్త టెక్నాలజీ అందుబాటులోకి రానుంది. ఇకపై సభ్యులు తమకు కేటాయించిన సీట్లలో కూర్చుంటేనే వారి హాజరు నమోదవుతుంది. ఈ మేరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత హాజరు విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు బుధవారం వెల్లడించారు. ఈ బడ్జెట్ సమావేశాల నుంచే ఈ విధానం అమల్లోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీలో మీడియాతో మాట్లాడిన అయ్యన్నపాత్రుడు, ఇప్పటివరకు రిజిస్టర్‌లో సంతకాల ద్వారా హాజరు నమోదు చేసే పద్ధతికి స్వస్తి పలుకుతున్నట్లు తెలిపారు. నూతన ఏఐ విధానం ద్వారా సభ్యుల హాజరును మరింత కచ్చితంగా, పారదర్శకంగా నమోదు చేసేందుకు వీలు కలుగుతుందని వివరించారు. పెద్ద కార్పొరేట్ సంస్థల సీఈఓలు సైతం బయోమెట్రిక్ విధానాన్ని వాడుతున్నారని, పార్లమెంట్‌లోనూ ఇలాంటి టెక్నాలజీని తీసుకురావాలని యోచిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా, బడ్జెట్ సమావేశాల తొలిరోజు గవర్నర్ ప్రసంగానికి హాజరై వాకౌట్ చేసిన వైసీపీ ఎమ్మెల్యేల గురించి స్పీకర్ సరదాగా ప్రస్తావించారు. “11వ తేదీన 11 మంది వచ్చి 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారు” అని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే, 2028 డిసెంబర్ నాటికి అమరావతిలో దేశంలోనే అత్యుత్తమమైన కొత్త అసెంబ్లీ భవనం సిద్ధమవుతుందని స్పీకర్ తెలిపారు. భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన జరిగితే, 300 మందికి పైగా సభ్యులు కూర్చునేలా దీనిని నిర్మిస్తామని ఆయన వివరించారు. ఈ కొత్త విధానంతో సభా కార్యకలాపాల్లో సభ్యుల భాగస్వామ్యం పెరుగుతుందని భావిస్తున్నారు.

## అవి పాత లెక్కలే: మంత్రి అచ్చెన్నాయుడు

విజయవాడ, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వైసీపీ పేటీఎం బ్యాచ్‌లు 2018-19 నాటి పాత గణాంకాలను చూపిస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. గత ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలోనే రాష్ట్ర రైతాంగం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందని తెలిపారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు స్పందిస్తూ, “2019-24 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో రైతు కుటుంబం సగటు అప్పు రూ. 2.45 లక్షలకు చేరింది. దీంతో దేశంలోనే అత్యధిక రైతు రుణాలున్న రాష్ట్రంగా ఏపీ నిలిచింది. అంతేకాకుండా, ఎన్సీఆర్బీ లెక్కల ప్రకారం గత ఐదేళ్లలో రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రం నిరంతరం టాప్-3లోనే ఉంది. ఈ వాస్తవాలను కప్పిపుచ్చి వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది” అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో పీఎం-ప్రణామ్ పథకం కింద రూ. 216 కోట్లు, ‘పర్ డ్రాప్ మోర్ క్రాప్’ కింద రూ. 695 కోట్లు సాధించారని తెలిపారు. కొబ్బరి రైతులను ఆదుకునేందుకు రూ. 200 కోట్లతో ప్రాసెసింగ్ పార్కులు, కర్ణాటక తరహాలో ఆధునిక మార్కెట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేసి, పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను ధ్వంసం చేసిందని అచ్చెన్నాయుడు ఆరోపించారు. చంద్రబాబు నాయకత్వంలో మళ్లీ వ్యవసాయాన్ని పండగలా మారుస్తామని, ‘అన్నదాత సుఖీభవ’ నినాదంతో ప్రతి రైతుకు భరోసా కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికైనా అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని వైసీపీకి హితవు పలికారు.

## అంబటికి బెయిల్ మంజూరు



గుంటూరు, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుకు గుంటూరు కోర్టులో ఊరట లభించింది. సీఐ విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలతో నమోదైన కేసులో ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. అదే సమయంలో, ఆయన్ను కస్టడీకి అప్పగించాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. గత ఏడాది నవంబర్ 12న ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గుంటూరులో నిర్వహించిన ర్యాలీ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న సీఐని అడ్డుకున్నారని అంబటి రాంబాబుపై కేసు నమోదైంది. ఈ కేసులో ఆయనపై పీటీ వారెంట్ జారీ కావడంతో, పట్టాభిపురం పోలీసులు మూడు రోజుల క్రితం ఆయన్ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసుకు సంబంధించి విచారణ జరిపిన గుంటూరు కోర్టు, తాజాగా అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న ఆయన, కోర్టు ఉత్తర్వులతో గురువారం విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

## వైసీపీతో జాగ్రత్త

**3 పార్టీలకు పవన్ హెచ్చరిక**

అమరావతి, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): వైసీపీపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగిస్తుండగా 11 నిమిషాల పాటు నిరసన తెలిపి వాకౌట్ చేశారు. అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం కమిటీ హాలులో చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, వైసీపీ కుట్రల పట్ల కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైసీపీ హిందూమతాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. దక్షిణ భారతదేశంలో ప్రతి ఒక్కరూ హిందూమతాన్ని గౌరవిస్తారని అన్నారు. మన ప్రభుత్వంపై జగన్, ఆయన పార్టీ చేసే కుట్రలను గుర్తించాలని అన్నారు. అనంతరం, పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, సభలో ఎంతసేపు మాట్లాడామనే దానికంటే అవసరమైన విషయం ఎంత మాట్లాడామనేది ముఖ్యమని అన్నారు. దావోస్‌లో ముఖ్యమంత్రి, తాను ప్రతి సంస్థపై ముందస్తుగా కసరత్తు చేసినట్లు చెప్పారు. అందుకే తమను కలిసిన ప్రతి సంస్థకు ముఖ్యమంత్రి క్లుప్తంగా ఏడు నిమిషాల్లోనే విషయం చెప్పి ముగించేవారని గుర్తు చేసుకున్నారు. అందుకే తక్కువ సమయంలో ఎక్కువమంది పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి కలవగలిగారని అన్నారు. శాసనసభలో కూడా సభ్యులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

## శ్రీశైలం నడకదారిలో పెద్దపులి కలకలం

శ్రీశైలం, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులకు భయంకరమైన అనుభవం ఎదురైంది. నల్లమల అటవీ మార్గంలో వారికి ఏకంగా ఓ పెద్దపులి ఎదురుపడింది. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం పరిధిలోని పెద్దచెరువు సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో భక్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే, శివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలానికి కాలినడకన వెళుతున్న భక్తుల బృందానికి దారి పక్కన పొదల్లో పెద్దపులి కనిపించింది. కొద్దిసేపు భక్తులను తీక్షణంగా చూస్తూ అక్కడే నిలబడింది. అటవీశాఖ అధికారుల హెచ్చరికలతో అప్రమత్తంగా ఉన్న భక్తులు, భయంతో పరుగులు తీయకుండా నిల్చుండిపోయారు. ఇరువైపులా నిశ్శబ్దం నెలకొనగా, క్షణక్షణం ఉత్కంఠగా గడిచింది. కొంతసేపటికి ఆ పులి నెమ్మదిగా అడవిలోకి వెళ్లిపోవడంతో భక్తులంతా ఊపిరి పీల్చుకున్నారు. ‘శ్రీశైలం మల్లన్నే కాపాడాడు’, ‘ఓం నమశ్శివాయ’ అంటూ భక్తితో నినాదాలు చేస్తూ తమ యాత్రను కొనసాగించారు. ఈ ఘటనను ఓ వాహనదారుడు తన సెల్‌ఫోన్‌లో వీడియో తీశారు. అన్నదాన శిబిరానికి సరుకులు తీసుకెళుతున్న ఆయన, ఈ వీడియోను ఇతర యాత్రికులకు చూపించి వారిని అప్రమత్తం చేశారు. నల్లమల అడవి గుండా వెళ్లే యాత్రికులు గుంపులుగా వెళ్లాలని, ఒంటరిగా ప్రయాణించవద్దని అటవీ అధికారులు సూచిస్తున్నారు. ఈ ప్రాంతంలో పులుల సంచారం సాధారణమే అయినప్పటికీ, ఇలా యాత్రికులకు ముఖాముఖి ఎదురుపడటం ఆందోళన కలిగిస్తోంది. అయితే, మల్లికార్జున స్వామి దయవల్లే తమకు ఎలాంటి హాని జరగలేదని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తున్నారు.

# వాలెంటైన్స్ డేను నిషేధించాలి

**భారతీయ సంస్కృతికి వాలెంటైన్స్ డే వ్యతిరేకం.. బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ రావు**




హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): : ఫిబ్రవరి 14న నిర్వహించే ‘వాలెంటైన్స్ డే’ ను నిషేధించాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడ లోని బజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో వాలెంటైన్ డే ను నిషేధించాలని పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. వాలెంటైన్స్ డే వేడుక యువతలో తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చురుకుగా పర్యవేక్షించాలని, వాలెంటైన్స్ డే జరుపుకోవడం వల్ల కలిగే సాంస్కృతిక చిక్కుల గురించి వారికి అవగాహన కల్పించాలని కోరారు, ఇది భారతీయ విలువలలో పాతుకుపోయిన పాశ్చాత్య సంప్రదాయం కాదని ఆయన అభివర్ణించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటం, ప్రోత్సహించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. పబ్బులు, హోటళ్ళు, మాల్స్, రిసార్ట్‌లు, ఇతర వ్యాపార సంస్థలు వాలెంటైన్స్ డేను వాణిజ్యీకరించడం పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అటువంటి సంస్థలు ప్రధానంగా వాణిజ్య లాభాల కోసం ఈ సందర్భాన్ని ప్రోత్సహిస్తాయని, తన దృష్టిలో భారతీయ సంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్న పాశ్చాత్య సాంస్కృతిక పద్ధతుల ప్రభావాన్ని పరిమితం చేయడంపై విస్తృత చర్చకు ఆయన పిలుపునిచ్చారు. యువతను ఉద్దేశించి ప్రవీణ్ యాదవ్ మాట్లాడుతూ.. భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని యువత గర్వించాలని మరియు శివాజీ జయంతి మరియు మహా శివరాత్రి వంటి పండుగలను ఉత్సాహంగా మరియు భక్తితో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. భారతీయ సాంస్కృతిక విలువలను నిలబెట్టి అనుసరించాలని ఆయన వారిని ప్రోత్సహించారు. సమావేశంలో భజరంగ్ సేన ఉపాధ్యక్షుడు (తెలంగాణ) ప్రభు బిరాదార్, జాయింట్ సెక్రటరీ శ్రీమతి ఆర్తి మహేంద్రకర్, మనోజ్ మొగల్గిడ్డి, ప్రవీణ్ యాదవ్, రామేశ్వర్ మిశ్రా, అజయ్ నాయుడు, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లాలో 70.13% పోలింగ్



జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు.మొత్తం ఐదు మున్సిపాలిటీల లో మొత్తం 136 వార్డులకు, 379 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ జరిగిందని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరగడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఆయన.. ఓటర్లు ఎంతో చైతన్యంతో, బాధ్యతాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. యువ ఓటర్లు ఎన్నికల ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొన్నందున శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించడంలో సహకరించిన ప్రజలకు, ఎన్నికల్లో పాల్గొని సమన్వయం తో పనిచేసిన వివిధ స్థాయిల అధికారులకు, పోలీస్ యంత్రాంగానికి, ఎన్నికలలో పాల్గొన్న సిబ్బందికి, ఎన్నికల సమగ్ర సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసిన పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్ట్రాంగ్ రూంకు తరలిన బ్యాలెట్ బాక్సులు




జగిత్యాల, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పూర్తిగా ప్రశాంత వాతావరణంలో ముగిసిందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల నుండి బ్యాలెట్ బాక్స్‌లను పటిష్టమైన పోలీస్ బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌కు తరలించినట్లు వెల్లడించారు. స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో పోలీసు అధికారులు, సిబ్బందితో 24 గంటల పహారా ఏర్పాటు చేసి మల్టీ-లేయర్ భద్రతా వ్యవస్థ అమలు చేస్తున్నామని అన్నారు సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతోందని చెప్పారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ మొత్తం శాంతియుతంగా ముగియడంలో ప్రజలు, ఎన్నికల అధికారులు, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేశారని ఎస్పీ ప్రశంసించారు. ప్రశాంతంగా ఓటింగ్ ప్రక్రియ ముగియడంలో కృషి చేసిన పోలీస్ సిబ్బందికి, అధికారులకు అభినందనలు తెలిపారు. అలాగే ప్రజలు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

# అమరావతే ఏపీ శాశ్వత రాజధాని

**ఏపీ అసెంబ్లీలో గవర్నర్ స్పష్టీకరణ.. జీఎస్‌డీపీ 17.62 లక్షల కోట్లకు చేరిందని వెల్లడి**



అమరావతి, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ ప్రక్రియ పక్కాగా గాడిన పడిందని, ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ జాగ్రత్తతో కూడిన ప్రాధాన్యతలు, సంస్కరణల ద్వారా రాష్ట్రం వృద్ధి పథంలోకి తిరిగి వస్తోందని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. బుధవారం నాడు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా శాసనసభ, శాసనమండలి ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత 21 నెలల్లో ప్రభుత్వం మౌలిక సంస్కరణలను పూర్తి చేసిందని, అన్ని రంగాల్లోనూ స్పష్టమైన ఫలితాలు కనిపిస్తున్నాయని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ద్వారా రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను ప్రజలు తమ ప్రభుత్వానికి అప్పగించారని గవర్నర్ గుర్తుచేశారు. “గత కొన్నేళ్ల ఆర్థిక ఒత్తిడి తీవ్ర అసమతుల్యతలను సృష్టించింది. అనేక రంగాల్లో గణనీయమైన అప్పులు పేరుకుపోయాయి. అయినా, ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికి, రుణ వ్యయాలను తగ్గించడానికి, విశ్వసనీయతను తిరిగి సంపాదించడానికి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంది. స్వర్ణాంధ్ర దార్శనికతతో ముందుకు సాగుతున్నాం” అని ఆయన వివరించారు. ప్రభుత్వ ప్రయత్నాల ఫలితంగా రాష్ట్ర ఆర్థిక పనితీరు మెరుగుపడిందని గవర్నర్ తెలిపారు. “2025-26 మొదటి ముందస్తు అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి గత ఏడాది రూ.15.91 లక్షల కోట్ల నుంచి రూ.17.62 లక్షల కోట్లకు పెరిగింది. ఇది 10.75 శాతం నామమాత్రపు వృద్ధి రేటును సూచిస్తోంది. రాష్ట్ర తలసరి ఆదాయం గతేడాది రూ.2.66 లక్షల నుంచి రూ.2.95 లక్షలకు పెరిగింది. వ్యవసాయ రంగంలో 7.83 శాతం, పరిశ్రమల రంగంలో 9.53 శాతం, సేవల రంగంలో 12.94 శాతం వృద్ధి సాధించాం” అని ఆయన గణాంకాలతో సహా వివరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన దుష్పరిపాలనపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసినట్లు గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రజాధనం దుర్వినియోగం, పోలవరం ప్రాజెక్టును పట్టాలు తప్పించడం, విద్యుత్ రంగం విధ్వంసం, సహజ వనరుల దుర్వినియోగం, అవినీతిమయమైన ఎక్సైజ్ విధానాలు, శాంతిభద్రతల క్షీణతతో పాటు భవిష్యత్ రాజధాని అమరావతిని నాశనం చేసే లక్ష్యంతో చేసిన మూడు రాజధానుల ప్రతిపాదన వంటి అంశాలను ఈ శ్వేతపత్రాల ద్వారా ప్రజల ముందు ఉంచామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ‘సూపర్ సిక్స్’ హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించామని, క్రమంగా పాలనను పునరుజ్జీవనం నుంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లామని గవర్నర్ తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ అనే జాతీయ ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్రాన్ని ‘సంపన్న, ఆరోగ్యకరమైన, సంతోషకరమైన’దిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ పరివర్తన యజ్ఞంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. మన బలంపై విశ్వాసంతో, ఐక్య లక్ష్యంతో ఏపీ ముందుకు సాగుతోందని, ప్రతి పౌరుడూ గౌరవంగా, అవకాశాలతో జీవించే భవిష్యత్తుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు.

## గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారు

విజయవాడ, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): రాష్ట్ర బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ చేసిన ప్రసంగం పూర్తిగా డొల్లగా, అవాస్తవాలు, కల్పితాలతో నిండి ఉందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టోకు కొన్ని మెరుగులు దిద్ది చదివినట్లుగా ఉందని, రాష్ట్ర అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి ఎలాంటి దశ, దిశ లేదని ఆమె ఎద్దేవా చేశారు. 19 నెలల పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి పాలనపై విజన్ గానీ, విజ్ఞత గానీ లేవని, సుపరిపాలన, సమతూకం మచ్చుకైనా కనిపించడం లేదని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అయ్యాయని షర్మిల విమర్శించారు. రూ. 33 వేల కోట్లతో వాటిని అమలు చేస్తున్నామని చెప్పడం పూర్తిగా బూటకమని అన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు ఇస్తామన్న నిరుద్యోగ భృతి హామీ అడ్రస్ లేకుండా పోయిందని, తల్లికి వందనం కింద 20 లక్షల మంది విద్యార్థులను, అన్నదాత సుఖీభవ కింద 40 లక్షల మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మార్చారని, గోడ క్యాలెండర్లు మారుతున్నా జాబ్ క్యాలెండర్ మాత్రం రావడం లేదని విమర్శించారు. కోటి మంది మహిళలకు నెలకు రూ. 1500 ఇచ్చే ఆడబిడ్డ పథకానికి దిక్కులేదని, కానీ 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మారుస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు తగ్గించి దానిలో జీవం తీశారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. సంజీవని లాంటి ఆరోగ్యశ్రీని యూనివర్సల్ హెల్త్ పాలసీ పేరుతో చంపేశారని, 1.43 కోట్ల కుటుంబాలకు వైద్యాన్ని అందని ద్రాక్ష చేశారని మండిపడ్డారు. రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాలు అనేవి అభూత కల్పనలని కొట్టిపారేశారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత అంటూ డ్రామాలు ఆడుతున్నారే తప్ప చేతల్లో అది కనిపించడం లేదని అన్నారు. కిలో రూపాయికి టమాటో, ఉల్లి అమ్ముకుంటున్న రైతులను పట్టించుకోకుండా, మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా ఆదుకున్నామని చెప్పడం దారుణమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత జగన్ వైఖరిపైనా షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలు ఓట్లేసి గెలిపించింది ఒక్కరోజు మురిపెం కోసం కాదని, మైకు ఇస్తేనే మాట్లాడతా అని మారం చేయడానికి అసెంబ్లీకి పంపలేదని అన్నారు. జగన్ తన సొంత అజెండాను పక్కనపెట్టి, ప్రజా అజెండాతో సభకు వెళ్లి అధికార పక్షాన్ని నిలదీయాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై, హామీలపై సభావేదికగా పోరాడాలని సూచించారు. శాసనసభకు వెళ్లే దమ్ము, ధైర్యం లేకుంటే జగన్ తన ఎమ్మెల్యేలతో సహా రాజీనామా చేయాలని షర్మిల సవాల్ విసిరారు.

## చంపేస్తామని బెదిరిస్తున్నారు

**ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి**

అమరావతి, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): మావోయిస్టుల పేరుతో వచ్చిన బెదిరింపు లేఖపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ స్పందించారు. ఈ బెదిరింపు లేఖతో తన కుటుంబం ఆందోళన చెందుతోందని ఆయన అన్నారు. మావోయిస్టులు బెదిరింపు లేఖ రాసేంత ఏమీ లేదని అన్నారు. ఎవరో ఉద్దేశపూర్వకంగా ఈ లేఖ రాసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. తన పర్యాటక శాఖ చాలా చిన్నదని గుర్తు చేశారు. వ్యక్తిగతంగా, శాఖాపరంగానూ తాము ఎక్కడా తప్పు చేయలేదని మంత్రి పేర్కొన్నారు. అందుకే ఎవరో కావాలని లేఖలు రాసినట్లుగా అర్థమవుతోందని పేర్కొన్నారు. తనకు వచ్చిన బెదిరింపు లేఖలపై విచారణ కొనసాగుతోందని అన్నారు. కాగా, కందుల దుర్గేశ్ సహా నలుగురు ఏపీ మంత్రులకు మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖ వచ్చిన విషయం తెలిసిందే. అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, కొల్లు రవీంద్రలకు కూడా బెదిరింపు లేఖలు వచ్చాయి.

### పోలీసుల అప్రమత్తం

బెదిరింపు లేఖపై పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. పోలీసులు ప్రస్తుతం రెండు ప్రధాన కోణాల్లో విచారణ చేపట్టారు. ఈ లేఖ నిజంగానే మావోయిస్టులు పంపించారా? లేక ఎవరైనా ఆకతాయిలు లేదా రాజకీయ ప్రత్యర్థులు మావోయిస్టుల పేరును ఉపయోగించి బెదిరింపులకు పాల్పడ్డారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు. లేఖ ఎక్కడి నుంచి పోస్టు చేశారు? సచివాలయంలోకి అది ఎలా చేరింది? అన్న విషయాలపై సీసీటీవీ ఫుటేజ్, పోస్టల్ రికార్డులను పరిశీలిస్తున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు కూడా లేఖపై ఉన్న హ్యాండ్ రైటింగ్, ఫింగర్ ప్రింట్స్ తదితర అంశాలను విశ్లేషిస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేశ్‌కు భద్రతను మరింత పెంచే అవకాశముందని తెలుస్తోంది. ఆయన నివాసం, కార్యాలయం, పర్యటనల సమయంలో పోలీసు పహారా పెంచాలని ఉన్నతాధికారులు ఆలోచిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే మావోయిస్టు కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉన్న భద్రతా యంత్రాంగం, ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని లోతైన విచారణ చేపట్టింది.



## ఏపీఎస్ ఆర్టీసీలో త్వరలో పదోన్నతులు

**7,514 మందికి ప్రమోషన్!**

విజయవాడ, ఫిబ్రవరి 11 (ఈవార్తలు): ఆర్టీసీ ఉద్యోగులకు ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతుల ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, అర్హులైన 7,514 మందికి త్వరితగతిన పదోన్నతులు కల్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. సచివాలయంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుతో కలిసి ఆర్టీసీ, రవాణా శాఖలపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు మంత్రికి వివరాలు వెల్లడించారు. 2025-26 డీపీసీ కింద అర్హులైన ఉద్యోగుల ఎంప్యానల్‌ను ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆర్టీసీలో 44,131 మంది ఉద్యోగులే ఉన్నారని, వచ్చే మూడేళ్లలో 6,891 మంది పదవీ విరమణ చేయనున్నట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో 7,673 ఖాళీల భర్తీకి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అలాగే మెడికల్ అన్‌ఫిట్ అయిన 682 మంది ఉద్యోగుల్లో 36 మందికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు, మరో 646 మందికి ఆర్థిక పరిహారం చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఏపీలో తిరిగే బస్సులకు సంబంధించిన అఖిలభారత టూరిస్ట్ పర్మిట్ పన్నులపై ట్రావెల్స్ బస్సుల సంఘాలతో సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకుందామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. పన్ను తగ్గిస్తే ఆయా బస్సులు ఏపీలోనే రిజిస్ట్రేషన్ అవుతాయని రవాణా అధికారులు మంత్రికి వివరించారు. డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల కోసం జారీ చేసే స్మార్ట్ కార్డుల టెండర్ నిబంధనలు త్వరగా ఖరారు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలకు వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ డివైజ్ (వీఎల్‌టీ) ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉన్నందున, అందుకు సంబంధించిన ఆర్ఎఫ్‌పీ (ఆర్ఎఫ్‌పీ)ను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రవాణా కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా, ఆర్టీసీ ఈడీలు బ్రహ్మానందరెడ్డి, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

# కచ్ త్రివర్ణ పతాకం.. స్వయంసమృద్ధికి నిదర్శనం



గుజరాత్‌లోని కచ్ సరిహద్దుల్లో ఉన్న శ్వేత మరుభూమి.. భారతంలో మారుతున్న ఆత్మవిశ్వాసానికి సజీవ సాక్ష్యంగా నిలిచింది. ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇక్కడ ప్రపంచంలోనే అతిపెద్ద ఐకానిక్ ఖాదీ త్రివర్ణ పతాకాన్ని అత్యంత వైభవంగా ప్రదర్శించారు. ఇది కేవలం ఒక ప్రదర్శన మాత్రమే కాదు, ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో దేశం సాధిస్తున్న స్వయం సమృద్ధికి, జాతీయ సంకల్పానికి నిదర్శనం. ఈ అద్భుత దృశ్యాన్ని దేశంలోని కళాకారులు, సైనికులు, పౌరులు వీక్షించారు. దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఖాదీ కళాకారులు వీడియో సందేశాల ద్వారా జాతీయ జెండాకు వందనం సమర్పించి కొత్త రికార్డు సృష్టించారు. ఒకప్పుడు స్వాతంత్ర్య ఉద్యమ ఆత్మగా ఉన్న ఖాదీ, నేడు ఆత్మనిర్భర్ భారత్ శక్తిగా పునర్నిర్వచించబడుతోంది. 25 ఏళ్ల క్రితం భూకంపంతో అతలాకుతలమైన భుజ్ నగరం, నేడు అభివృద్ధికి నమూనాగా నిలిచింది. అప్పటి ముఖ్యమంత్రి, నేటి ప్రధాని మోదీ నాయకత్వంలో, భుజ్ నగరం పటిష్టమైన మౌలిక సదుపాయాలతో సరికొత్తగా పునరుజ్జీవనం పొందింది. సరిహద్దు ప్రాంతాల్లో అభివృద్ధి, భద్రత ఒకదానికొకటి తోడై దేశ ఆర్థిక పురోగతికి బాటలు వేస్తున్నాయి. ఇక, ప్రధాని మోదీ నేతృత్వంలో ఖాదీ విప్లవం దేదీప్యమానంగా కొనసాగుతోంది. మోదీ మాటల్లో చెప్పాలంటే, ఖాదీ కేవలం వస్త్రం మాత్రమే కాదు, అది ఒక సిద్ధాంతం. ఈ సిద్ధాంతం నేడు క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలను ఇస్తోంది. ఖాదీ, గ్రామ పరిశ్రమల ఉత్పత్తుల అమ్మకాలు రూ. 1.70 లక్షల కోట్లు దాటాయి, త్వరలోనే ఇవి రూ. 2 లక్షల కోట్లకు చేరనున్నాయి. ఈ రంగం ద్వారా సుమారు 2 కోట్ల మందికి పైగా ఉపాధి లభిస్తోంది. గత 11 ఏళ్లలో 2.88 లక్షల యంత్రాలు, టూల్‌కిట్లను కళాకారులకు పంపిణీ చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారు. కాయకష్టానికి తగిన గౌరవం కల్పించడమే ఈ మార్పుకు ప్రధాన కారణం. ఖాదీ కళాకారుల వేతనాన్ని చిటికెకు రూ. 15 ఉండగా, దానిని రూ. 20 కి పెంచాలని నిర్ణయించారు. ఇది కళాకారుల యుగానికి నాంది. సామాజిక మాధ్యమాల్లో 'ఐకానిక్ ఖాదీ తిరంగా' హ్యాష్‌ట్యాగ్‌కు 2 కోట్ల పైగా వ్యూస్ రావడం, నేటి యువత తమ సాంస్కృతిక మూలాలను ఎంతగా ప్రేమిస్తున్నారో తెలియజేస్తోంది. కచ్‌లోని తెల్లని ఎడారిలో రెపరెపలాడిన ఈ త్రివర్ణ పతాకం, భారతావని సాధిస్తున్న ఘనతలకు, దేశం ఉజ్వల భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తోంది.

**- మనోజ్ కుమార్, చైర్మన్, ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్**



## ముంబైలో మ్యూజికల్ రోడ్డు

ముంబై: ముంబై కోస్టల్ రోడ్ (ఎంసీఆర్పీ) లోని కొంత భాగం దేశీయ మొట్టమొదటి సంగీత రహదారిగా (మ్యూజికల్ రోడ్డు) మారింది. హంగేరియన్ టెక్నాలజీ సహకారంతో కోస్టల్ రోడ్డులోని నారిమన్ ప్రాంతం నుంచి వర్లి వైపు వెళ్లే క్యారేజ్‌వేపై 700 మీటర్ల మేర పలు సంగీత స్ట్రిప్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు స్లమ్‌డాగ్ మిలియనీర్ సినిమాలోని 'జయహో' పాటను వినిపించనుంది. ఈ పాటను దేశానికి అంకితం చేయడానికి, ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడానికి ఈ విధంగా డిజైన్ చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ మ్యూజికల్ రోడ్డు ఈ మార్గం గుండా వాహనదారులను అలరిస్తుందని అన్నారు. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రూ. 6.21 కోట్ల వ్యయం అయినట్లు అధికారులు తెలిపారు. ముంబై కోస్టల్ రోడ్డు కారిడార్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఈ రహదారి దేశంలోనే మొట్టమొదటి మ్యూజికల్ రోడ్డుగా నిలుస్తుందని అన్నారు. ఇటువంటి మ్యూజికల్ రహదారులు హంగేరీ, జపాన్, దక్షిణ కొరియా, యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌లో మాత్రమే ఉన్నాయని అన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ దీనిని ఈరోజు ప్రారంభించారు.

## స్పష్టమైన వైఖరితో ఉన్నాం

**యూఎస్‌తో ట్రేడ్ డీల్‌పై వాణిజ్య శాఖ కార్యదర్శి**

న్యూఢిల్లీ: వాణిజ్య ఒప్పందాలలో, సున్నిత రంగాలపై భారతదేశం ఎల్లప్పుడూ స్పష్టమైన వైఖరితో చర్చలు జరిపిందని, అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలోనూ వ్యవసాయం సహా కీలక రంగాల ప్రయోజనాలను కాపాడేలా ముందుకు వెళ్లామని భారత వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వెల్లడించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. దేశానికి అత్యంత కీలకమైన రంగాలను దృష్టిలో ఉంచుకుని స్పష్టమైన వైఖరితోనే వాణిజ్య చర్చలు జరిపినట్లు తెలిపారు. అన్ని ఒప్పందాల విషయంలో ఇలా స్పష్టమైన వైఖరితోనే ఉన్నామని అన్నారు. మన రైతులు, మత్స్యకారులు, పాడిపరిశ్రమ సహా ప్రభావితమవుతాయని భావించిన రంగాలను దృష్టిలో ఉంచుకుని, వాటిని రక్షించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. భారత్, అమెరికా ఉమ్మడి ప్రకటనను చట్టబద్ధమైన ఒప్పందంగా మార్చడానికి ఇరు దేశాలు పనిచేస్తున్నాయని, మార్చి నెలాఖరు నాటికి దీనిని ఖరారు చేసి సంతకాలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని ఒప్పందాలలో సున్నితమైన రంగాలకు రక్షణ కల్పించామని, అంతగా సున్నితం కానటువంటి రంగాల విషయంలో మాత్రం మన మార్కెట్‌ను తెరిచేందుకు సుంకాలను ఉపయోగించామని తెలిపారు. కీలకమైన మన ఉత్పత్తులు ఉన్న రంగాల్లో మాత్రం మార్కెట్ ఇవ్వలేమని అమెరికాకు స్పష్టం చేశామని అన్నారు.

# భారత్‌ను అమెరికాకు అమ్మేశారు


**కేంద్రంపై రాహుల్ గాంధీ ఫైర్.. భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై విమర్శలు**



న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఒప్పందం దేశ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని, దీని ద్వారా దేశాన్ని, 'భారత మాత'ను అమెరికాకు అమ్మేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న రాహుల్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. విదేశీ క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లకు పన్ను రాయితీలు ఇవ్వడంపై రాహుల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఆర్థిక మంత్రి నవ్వుతున్నారు, ఆమెకు నవ్వడం అంటే చాలా ఇష్టం. పెద్ద టెక్ కంపెనీలకు 20 ఏళ్ల పాటు పన్ను మినహాయింపు ఇచ్చారు. మన డేటాతో మీరు చేసిందేమిటి?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ వాణిజ్య ఒప్పందం కింద టారిఫ్‌లలో చేసిన మార్పులు ఏకపక్షంగా అమెరికాకు మేలు చేసేలా ఉన్నాయని రాహుల్ ఆరోపించారు. "మొదట్లో మనపై సగటు టారిఫ్ 3 శాతం ఉండేది, ఇప్పుడు అది 18 శాతానికి పెరిగింది. అంటే ఆరు రెట్లు ఎక్కువ. అమెరికా నుంచి దిగుమతులు 46 బిలియన్ డాలర్ల నుంచి 146 బిలియన్ డాలర్లకు పెరుగుతాయి. కానీ మనకు వాళ్లు ఎలాంటి హామీ ఇవ్వలేదు. మనం మాత్రం వారికి కట్టుబడి ఉండాలి. వాళ్లపై మన టారిఫ్ 16 శాతం నుంచి సున్నాకి తగ్గింది, మనపై మాత్రం వాళ్ల టారిఫ్ 3 నుంచి 18 శాతానికి పెరిగింది" అని ఆయన గణాంకాలతో వివరించారు. ఈ ఒప్పందం వల్ల దేశంలోని టెక్స్‌టైల్ పరిశ్రమ పూర్తిగా నాశనమవుతుందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. "అమెరికా బంగ్లాదేశ్‌పై సుంకాన్ని సున్నా శాతానికి తగ్గించింది, కానీ భారత్‌పై 18 శాతం విధిస్తోంది. మన టెక్స్‌టైల్ పరిశ్రమదారులు ఏం చేయాలి? వాళ్ల పోటీదారు బంగ్లాదేశ్. వాళ్లు అమెరికా కాటన్‌ను దిగుమతి చేసుకుంటే సున్నా డ్యూటీ. దీంతో మన టెక్స్‌టైల్ పరిశ్రమ పూర్తిగా నాశనమైపోతుంది" అని అన్నారు. అంతేకాకుండా, ఈ ఒప్పందం దేశ ఇంధన స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తుందని రాహుల్ ఆరోపించారు. "ఇకపై మనం ఏ దేశం నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తుంది, మన ప్రధానమంత్రి కాదు. వాళ్లు మనల్ని పర్యవేక్షిస్తారు. అమెరికాకు నచ్చని దేశం నుంచి భారత్ చమురు కొంటే, మనపై టారిఫ్‌లతో శిక్ష విధిస్తారు" అని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం కాలరాస్తోందని, "పేద రైతులను అణచివేయడానికి తలుపులు తెరిచారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శల తీవ్రతను పెంచుతూ, "మీరు భారతదేశాన్ని అమ్మేశారని నేను చెబుతున్నాను. దేశాన్ని అమ్మడానికి మీకు సిగ్గుగా లేదా? మన తల్లి భారత్ మాతను అమ్మేశారు" అని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి ఒత్తిడితోనే ఈ ఒప్పందానికి అంగీకరించారని ఆయన ఆరోపించారు. రాహుల్ వ్యాఖ్యలు లోక్‌సభలో తీవ్ర దుమారం రేపాయి.


# చైనా కోసం గూఢచర్యం!

**కాలిఫోర్నియా వ్యక్తికి జైలు శిక్ష**



న్యూయార్క్: అమెరికా స్థానిక రాజకీయాల్లో జోక్యం చేసుకోవడంతో పాటు చైనా ప్రభుత్వానికి రహస్య ఏజెంట్‌గా వ్యవహరించిన కేసులో ఓ వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష పడింది. కాలిఫోర్నియాకు చెందిన 65 ఏళ్ల యానింగ్ "మైక్" సన్‌కు 48 నెలల ఫెడరల్ జైలు శిక్ష విధిస్తూ కాలిఫోర్నియాలోని యునైటెడ్ స్టేట్స్ డిస్ట్రిక్ట్ కోర్టు తీర్పు ఇచ్చింది. విదేశీ ప్రభుత్వ ఏజెంట్‌గా అక్రమంగా వ్యవహరించినట్లు 2025 అక్టోబర్‌లో సన్ తన నేరాన్ని అంగీకరించాడు. అమెరికా న్యాయ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, సన్ 2022 నుంచి 2024 జనవరి మధ్య చైనా ప్రభుత్వ అధికారుల ఆదేశాలతో పనిచేశాడు. చట్ట ప్రకారం ఈ విషయాన్ని యూఎస్ అటార్నీ జనరల్‌కు తెలియజేయకుండా రహస్యంగా కార్యకలాపాలు సాగించాడు. "చైనా ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తూ, వారి అనుకూల ప్రచారాన్ని వ్యాప్తి చేస్తూ, చైనాకు ముప్పుగా భావించే సమూహాలపై నిఘా పెడుతూ సన్ అమెరికా సార్వభౌమత్వాన్ని దెబ్బతీశాడు" అని జాతీయ భద్రతా విభాగం అసిస్టెంట్ అటార్నీ జనరల్ జాన్ ఎ. ఐసెన్‌బర్గ్ తెలిపారు. 2022 నవంబర్‌లో దక్షిణ కాలిఫోర్నియాలో జరిగిన నగర మండలి ఎన్నికల్లో గెలిచిన ఓ అభ్యర్థికి సన్ ప్రచార సలహాదారుగా పనిచేశాడు. ఆ అభ్యర్థిని గెలిపించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, చైనాకు అనుకూల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించినట్లు ఫెడరల్ ప్రాసిక్యూటర్లు తెలిపారు. "అమెరికన్లు తమ ప్రతినిధులను ఎన్నుకున్నప్పుడు, వారు తమ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేస్తారని ఆశిస్తారు. కానీ, చైనా వంటి విదేశీ శత్రువు కోసం పనిచేస్తారని కాదు. సన్ తన పదవిని దుర్వినియోగం చేసి మా ప్రజాస్వామ్య ప్రక్రియలను బలహీనపరిచాడు" అని ఎఫ్‌బీఐ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రోమన్ రోజోవ్‌స్కీ అన్నారు. అంతేకాకుండా, 2023 ఏప్రిల్‌లో దక్షిణ కాలిఫోర్నియాలో పర్యటించిన అప్పటి తైవాన్ అధ్యక్షురాలిపై సన్ గూఢచర్యం చేశాడు. ఆమె కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని, నిరసనకారుల ఫొటోలను లాస్ ఏంజిల్స్‌లోని చైనా కాన్సులర్ అధికారికి పంపినట్లు కోర్టు పత్రాల్లో వెల్లడైంది. తన సేవలను వివరిస్తూ చైనా అధికారులకు రాసిన ఓ నివేదికలో, అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఓ "కొత్త రాజకీయ తారను" గెలిపించినట్లు సన్ పేర్కొన్నాడు. వాషింగ్టన్‌లో జరిగే జులై 4వ తేదీ పరేడ్‌లో చైనాకు అనుకూలంగా ప్రదర్శన నిర్వహించడానికి చైనా ప్రభుత్వం నుంచి 80,000 డాలర్లు కూడా అభ్యర్థించినట్లు తేలింది.

# నరవణె బుక్ బయటికెలా వచ్చింది?




**పెంగ్విన్ సంస్థకు ఢిల్లీ పోలీసుల నోటీసులు**

న్యూఢిల్లీ: ప్రముఖ పుస్తక ప్రచురణ సంస్థ 'పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా'కు ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంకు సంబంధించి రాజకీయ దుమారం చెలరేగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ పుస్తకం ప్రచురణ కానప్పటికీ రాహుల్ గాంధీ చేతికి ఈ కాపీ ఎలా చేరుకుందని ఇండియా టుడే డిజిటల్ మీడియాలో కథనం వచ్చింది. ఆ తర్వాత ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగి, ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పుస్తకం లీక్ అయినట్లు పేర్కొంటూ, ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ నేరపూరిత కుట్రకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. ఇంకా ప్రచురితం కాని ఆ పుస్తకానికి సంబంధించి పలు ప్రశ్నలను పోలీసులు సంధించారు. వాటికి పెంగ్విన్ నుండి సమాధానం అడిగారు. ప్రచురణ సంస్థ యాజమాన్యం విచారణలో భాగం కావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం అనుమతి పొందకముందే నరవణె రాసిన ఈ పుస్తకం బయటకు రావడం వివాదంగా మారింది. పుస్తకం ప్రచురితం కాలేదని, మార్కెట్‌లో అందుబాటులో లేదని ప్రచురణ సంస్థ 24 గంటల్లో రెండుసార్లు వివరణ ఇచ్చింది. కానీ లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాత్రం ఆ పుస్తకం మార్కెట్‌లో లభ్యమవుతుందని అన్నారు.

# కెనడాలో కాల్పుల కలకలం



**9 మంది మృతి.. నిందితుడి సూసైడ్**

ఒట్టావా: కెనడాలో మరోసారి కాల్పుల ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. బ్రిటిష్ కొలంబియాలోని టంబ్లర్ రిడ్జ్‌లో ఉన్న ఓ సెకండరీ స్కూల్‌లో జరిగిన కాల్పుల్లో నిందితుడి సహా మొత్తం 10 మంది మరణించారు. మరో 27 మంది గాయపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు ధ్రువీకరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టంబ్లర్ రిడ్జ్ సెకండరీ స్కూల్‌తో పాటు సమీపంలోని ఓ నివాస గృహంలో కూడా ఈ కాల్పులు జరిగాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు స్కూల్‌ను చుట్టుముట్టారు. లోపల గాలింపు చేపట్టగా, పలువురు మృత్యువాత పడి ఉండటాన్ని గుర్తించారు. నిందితుడు కూడా తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనలో స్కూల్‌లో ఆరుగురు, ఆసుపత్రికి తరలిస్తుండగా ఒకరు, నివాస గృహంలో ఇద్దరు మరణించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని, వారిని ఎయిర్‌లిఫ్ట్ చేసి ఆసుపత్రికి తరలించామని అధికారులు తెలిపారు. మిగిలిన 25 మందికి స్థానిక వైద్య కేంద్రంలో చికిత్స అందిస్తున్నారు. ఈ దాడికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, బీసీ ఆర్‌సీఎంపీ మేజర్ క్రైమ్ యూనిట్ దర్యాప్తు చేపట్టిందని పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం ప్రజలకు ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చేశారు. ఈ ఘటన నేపథ్యంలో, ఈ వారం మొత్తం స్థానిక స్కూళ్లకు సెలవు ప్రకటించారు. "ఈ విషాద ఘటన బాధితుల కుటుంబాలకు, ఆప్తులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం" అని ఆర్‌సీఎంపీ అధికారి ఒకరు ప్రకటనలో తెలిపారు.




## 6జీ వరల్డ్ లీడర్స్ మనమే

**కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా**

న్యూఢిల్లీ: 4జీ టెక్నాలజీ విషయంలో ప్రపంచాన్ని అనుసరించిన భారత్, 5జీలో ప్రపంచంతో కలిసి నడిచిందని, ఇక 6జీలో ప్రపంచానికే నాయకత్వం వహిస్తుందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ధీమా వ్యక్తం చేశారు. బుధవారం లోక్‌సభలో ప్రశ్నలకు సమాధానమిస్తూ, దేశంలో శరవేగంగా విస్తరిస్తున్న డిజిటల్ రంగం, భవిష్యత్ ప్రణాళికలను ఆయన వివరించారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా భారత్‌లో 5జీ సేవలు అందుబాటులోకి వచ్చాయని సింధియా తెలిపారు. కేవలం 22 నెలల వ్యవధిలోనే దేశంలోని 99.9 శాతం జిల్లాల్లో 5జీ సేవలను ప్రారంభించి ప్రపంచ రికార్డు సృష్టించామన్నారు. ఈ విస్తరణ కోసం టెలికాం సేవల సంస్థలు సుమారు రూ.4 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టాయని, దేశవ్యాప్తంగా 5 లక్షలకు పైగా బేస్ ట్రాన్స్‌సీవర్ స్టేషన్లు (బీటీఎస్) ఏర్పాటు చేశాయని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో 40 కోట్ల మంది 5జీ సేవలు పొందుతుండగా, 2030 నాటికి ఈ సంఖ్య 100 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. గత పదేళ్లలో దేశంలో బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ల సంఖ్య 6 కోట్ల నుంచి 100 కోట్లకు చేరిందని సింధియా తెలిపారు. గ్రామీణ భారతంలో వై-ఫై నెట్‌వర్క్‌ల విస్తరణ కొత్త విప్లవాన్ని సృష్టిస్తోందన్నారు. ఈ క్రమంలో, గ్లోబల్ 'నెట్‌వర్క్ రెడీనెస్ ఇండెక్స్ 2025'లో భారత్ తన స్థానాన్ని నాలుగు పాయింట్లు మెరుగుపరుచుకుని 45వ ర్యాంకులో నిలిచినట్టు కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ఇక టెక్నాలజీని అనుసరించే దేశం కాదని, ప్రపంచ డిజిటల్ లీడర్‌గా అవతరించిందని సింధియా అన్నారు. ఈ డిజిటల్ విప్లవం కేవలం నగరాలకే పరిమితం కాకుండా గ్రామాలకు సైతం విస్తరించి ప్రజల జీవన విధానాన్ని మారుస్తోందని ఆయన వివరించారు.

## సిద్ధరామయ్య మాట నిలబెట్టుకుంటారు

**నాయకత్వ మార్పుపై డీకే శివకుమార్ సోదరుడు**

**పదేపదే ప్రశ్నించవద్దన్న సిద్ధరామయ్య**

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో సంక్షోభం తీవ్రమవుతున్నట్లుగా కనిపిస్తోంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు, మాజీ ఎంపీ డీకే సురేశ్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. సిద్ధరామయ్య తన మాట నిలబెట్టుకుంటారని భావిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి మార్పు అంశంపై గత కొంతకాలంగా కర్ణాటకలో చర్చ జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీకే సురేశ్ ఈ అంశంపై స్పందించారు. ఇప్పటికే ఆలస్యమైందని, అయినప్పటికీ సిద్ధరామయ్య మాటను నిలబెట్టుకుంటారని తాము విశ్వసిస్తున్నామని అన్నారు. మరోవైపు, నాయకత్వ మార్పునకు సంబంధించిన ప్రశ్నలపై, డీకే సురేశ్ ప్రకటనపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందిస్తూ, మీడియా పదేపదే ఒకే ప్రశ్న అడగకూడదని అన్నారు. అధిష్ఠానం నిర్ణయం ఏదైనా తాను, డీకే శివకుమార్ ఇద్దరం కట్టుబడి ఉండాల్సిందేనని అన్నారు. నిర్ణయాన్ని అధిష్ఠానానికే వదిలేస్తున్నట్లు చెప్పారు. మీడియా ఇతర అంశాలను పక్కనపెట్టి పదేపదే నాయకత్వ మార్పు గురించి ప్రశ్నిస్తోందని సిద్ధరామయ్య అసహనం వ్యక్తం చేశారు. నాయకత్వ మార్పు గురించి ఎందుకు మాట్లాడుతున్నారని, అలాంటి ప్రకటనలు చేస్తున్న వారిని అడగాలని సూచించారు. ఎమ్మెల్యేలు న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలకు వారి సొంత ఖర్చులతో వెళుతున్నారని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. త్వరలో బడ్జెట్ తేదీని ప్రకటిస్తామని అన్నారు. ఢిల్లీలో ఉన్న డీకే శివకుమార్ నాయకత్వ మార్పు అంశంపై మాట్లాడుతూ, ముఖ్యమంత్రి, తాను ఏం మాట్లాడుకున్నామో తమకు తెలుసని, ఆ విషయాలు తర్వాత మాట్లాడుకుందామని పేర్కొన్నారు. సిద్ధరామయ్య తన మాటను నిలబెట్టుకోవాలని మీ సోదరుడు డీకే సురేశ్ అన్నారు కదా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, డీకే శివకుమార్ స్పందిస్తూ, కాలమే సమాధానం చెబుతుందని అన్నారు.

## అదానీ పరువునష్టం కేసులో జర్నలిస్టుకు జైలు

**ఏడాది కారాగారం, జరిమానా కూడా విధింపు**

అహ్మదాబాద్: అదానీ గ్రూప్ పై ఉద్దేశపూర్వకంగా తప్పుడు కథనాలు, ట్వీట్లు చేసినందుకు ఓ జర్నలిస్టును కోర్టు జైలుశిక్ష విధించింది. ప్రజలు, పెట్టుబడిదారుల్లో తమ విశ్వసనీయతను దెబ్బతీసేలా కథనాలు రాశారంటూ జర్నలిస్ట్ రవి నాయర్ పై అదానీ గ్రూప్ క్రిమినల్ డిఫమేషన్ కేసు దాఖలు చేసింది. ఈ కేసు విచారించిన మాన్సా మేజిస్ట్రేట్.. రవి నాయర్ చేసిన ట్వీట్లు కేవలం విమర్శలు కావని, అవి కంపెనీ విశ్వసనీయతను దెబ్బతీసేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ తన వాదనలను పక్కా ఆధారాలతో నిరూపించగలిగిందని కోర్టు స్పష్టం చేసింది. రవి నాయర్ ను దోషిగా తేలుస్తూ, ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. అదానీ గ్రూప్ ఫ్లాగ్‌షిప్ కంపెనీ అయిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) పై రవి నాయర్ గతంలో పలు ట్వీట్లు చేశారు. ఓ కథనం కూడా రాశారు. రవి నాయర్ తమ సంస్థపై తప్పుడు ప్రచారం చేశారని ఏఈఎల్ ఆరోపించింది. ఆయన ఉద్దేశపూర్వకంగా ట్వీట్లు చేసి తమ కంపెనీ ప్రతిష్టకు భంగం కలిగించారని, పెట్టుబడిదారులలో అయోమయం సృష్టించారని అదానీ గ్రూప్ పరువు నష్టం కేసు దాఖలు చేసింది.

## డీల్‌పై ఫ్యాక్ట్‌షీట్‌లో అమెరికా సవరణలు

**500 బిలియన్ డాలర్ల కొనుగోళ్లపై నిబద్ధత పదం ప్రయత్నంగా మార్పు**

**పప్పుధాన్యాలపై సుంకాల తగ్గింపు అంశం తొలగింపు**

**డిజిటల్ సేవల పన్ను ప్రస్తావనను పూర్తిగా తొలగించిన అమెరికా**

వాషింగ్టన్: భారత్-అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై విడుదల చేసిన అధికారిక ఫ్యాక్ట్‌షీట్‌లో వైట్‌హౌస్ నిశ్శబ్దంగా కీలక మార్పులు చేసింది. ఒప్పంద వివరాలు వెల్లడించిన కొన్ని రోజులకే ఈ సవరణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా, భారత్ కొనుగోళ్లకు సంబంధించిన పదజాలాన్ని మార్చడంతో పాటు, కొన్ని వ్యవసాయ ఉత్పత్తులు, డిజిటల్ పన్నుల ప్రస్తావనను తొలగించింది. తొలుత విడుదల చేసిన ఫ్యాక్ట్‌షీట్‌లో, అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు భారత్ "నిబద్ధతతో ఉంది" అని పేర్కొన్నారు. అయితే, సవరించిన వెర్షన్‌లో ఈ పదాన్ని "కొనుగోలు చేయాలని భావిస్తోంది" అని మార్చారు. ఒప్పందంపై భారత్ వైపు నుంచి ఉన్న కట్టుబాటు తీవ్రతను ఈ మార్పు తగ్గించేలా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో పాటు, అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై భారత్ సుంకాలు తగ్గిస్తుందన్న జాబితా నుంచి "కొన్ని రకాల పప్పుధాన్యాలు" అనే పదాన్ని తొలగించారు. ఇది భారత రైతులకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో ఈ మార్పు ప్రాధాన్యం సంతరించుకుంది. అదేవిధంగా, భారత్ తన డిజిటల్ సేవల పన్నును తొలగిస్తుందన్న వాక్యాన్ని కూడా ఫ్యాక్ట్‌షీట్ నుంచి పూర్తిగా తొలగించడం గమనార్హం. ఈ మార్పులను వైట్‌హౌస్ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఎలాంటి ప్రకటన లేకుండా చేసింది. ఈ సవరణలకు గల కారణాలపై అమెరికా ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక వివరణ రాలేదు. దీంతో ఒప్పందంలోని అంశాలపై ఇరు దేశాల మధ్య అవగాహన విషయంలో స్పష్టత లోపించిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

వయ్యారి చిత్రం





..నేడు జగపతి బాబు పుట్టిన రోజు..


# కాలం మెచ్చిన నటుడు

Happy Birthday Jagapathi Babu

జగపతి బాబు.. అసలు పేరు వీరమాచనేని జగపతి చౌదరి. తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటుడు. దశాబ్దాల కాలంగా హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణిస్తూ ఆయన అద్భుతమైన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న ఈయన.. నేటి యువతకు 'జగ్గూ భాయ్'గా సుపరిచితుడు.

తన తండ్రి వీబీ రాజేంద్రప్రసాద్ నిర్మాణంలో వచ్చిన సింహ స్వప్నం (1989) సినిమాతో ఆయన తెరంగేట్రం చేశారు. పెద్దరికం, గాయం వంటి చిత్రాలతో హీరోగా నిలదొక్కుకున్నారు. శుభలగ్నం, మావిచిగురు, పెళ్లి పీటలు వంటి సినిమాలతో ఫ్యామిలీ ఆడియన్స్‌కు, ముఖ్యంగా మహిళా ప్రేక్షకులకు ఆరాధ్య నటుడయ్యారు. నటుడిగా ఒకవైపు సక్సెస్ అయిన జగ్గూభాయ్.. 2014లో వచ్చిన లెజెండ్ సినిమాతో విలన్‌గా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించారు. ఈ సినిమా ఆయన కెరీర్‌ను పూర్తిగా మార్చేసింది. ఆ తర్వాత శ్రీమంతుడు, నాన్నకు ప్రేమతో, రంగస్థలం, అరవింద సమేత వంటి భారీ చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. జగపతి బాబు తన వ్యక్తిత్వం విషయంలో చాలా నిక్కచ్చిగా, సహజంగా ఉంటారు. సినీ పరిశ్రమలోని ఒడిదుడుకులను, ఆర్థిక ఇబ్బందులను కూడా బహిరంగంగా ఒప్పుకునే ధైర్యం ఆయనది. తెరపై హీరోగా ఉండటం కంటే నిజ జీవితంలో హీరోగా ఉండటమే ముఖ్యమని నమ్ముతారు. వయసు పెరిగే కొద్దీ తన రూపాన్ని (సాల్ట్ అండ్ పెప్పర్ లుక్) గౌరవిస్తూ, కొత్త రకమైన పాత్రలను ఎంచుకోవడంలో ఆయన చూపిన పరిణతి ఎందరికో స్ఫూర్తిదాయకం. ఎంతో అనుభవం ఉన్నా, నేటి తరం నటులతో కలిసి పనిచేసేటప్పుడు చాలా వినమ్రంగా ఉంటారని పేరు. ఆయన ప్రతిభకు గుర్తింపుగా అనేక అవార్డులు వరించాయి. ఉత్తమ నటుడిగా (మావిచిగురు), ఉత్తమ సహాయ నటుడిగా (అంతఃపురం), ఉత్తమ విలన్‌గా (లెజెండ్) సహా మొత్తం 7 నంది అవార్డులు అందుకున్నారు. ఉత్తమ సహాయ నటుడిగా, ఉత్తమ విలన్‌గా మొత్తం 4 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు సాధించారు. జగపతి బాబు కేవలం ఒక నటుడు మాత్రమే కాదు, కాలానికి అనుగుణంగా తనను తాను మలచుకుంటూ సాగిపోవాలని నిరూపించిన ఒక గొప్ప వ్యక్తిత్వం.








## డాక్టర్ శ్రీలీల

టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో అందం, అభినయంతో తనకంటూ తక్కువ సమయంలోనే ఎక్కువ గుర్తింపు సంపాదించుకున్న యంగ్ అండ్ క్రేజీ హీరోయిన్ శ్రీలీల మరో రేర్ ఫీట్ సాధించారు. సినిమా కెరీర్ తో పాటు ఎడ్యుకేషన్ కు ఈక్వల్ ఇంపార్టెన్స్ ఇస్తూ ఆమె మెడికల్ గ్రాడ్యుయేషన్ ను పూర్తి చేశారు. తాజాగా ఆమె ఎంబీబీఎస్ కోర్సు విజయవంతంగా కంప్లీట్ చేసి అఫిషియల్ గా డాక్టర్ గా మారారు. ఈ మేరకు రీసెంట్గా జరిగిన కాన్వకేషన్ సెలబ్రేషన్స్ కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సాధారణంగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన తర్వాత చాలా మంది నటీనటులు చదువును మధ్యలో ఆపేస్తుంటారు! కానీ శ్రీలీల మాత్రం అలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఒకవైపు షూటింగ్స్, మరోవైపు పరీక్షలు, క్లినికల్ ట్రైనింగ్ లను ప్యారలల్ గా చేస్తూ చదువు పూర్తి చేశారు. ఎంతో హార్డ్ గా ఉండే మెడికల్ కోర్సు పూర్తి చేయడం చిన్న విషయం కాదని, ఆమె పట్టుదలకు ఇది నిదర్శనమని ఇప్పుడు అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.



## సతీ లీలావతి ప్రమోషన్స్ బిగిన్స్

మెగా కోడలు లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'సతీ లీలావతి'. ఇక తాతినేని సత్య దర్శకత్వం వహించిన ఈ సినిమాను ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. కాగా మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా సమ్మర్‌లో రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. దీంతో అప్పుడే ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన మెగా కోడలు తాజాగా ఈ విషయాన్ని వెల్లడిస్తూ సోషల్ మీడియాలో ఓ స్టోరీ పెట్టింది. లావణ్యం తన ఇన్‌స్టాలో చిన్న వీడియో షేర్ చేస్తూ.. 'సతీ లీలావతి ప్రమోషన్స్ బిగిన్స్' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది.




## తమన్నాతోనే కర్ణాటక కాంట్రాక్ట్

మైసూర్ సాండల్ సోప్‌కు మిల్క్ బ్యూటీ తమన్నా బ్రాండ్ అంబాసిడర్‌గా ఖరారైన విషయం తెలిసిందే. కర్ణాటక ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే –మైసూర్ సాండల్ సోప్– ఉత్పత్తిని ప్రభుత్వమే కొన్ని దశాబ్దాలుగా చూసుకుంటోంది. అలాంటి ఈ ప్రోడక్ట్‌కు తమన్నా అయితే బాగుంటుందని కర్ణాటక ప్రభుత్వం తనని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. దీనిపై గత కొంత కాలంగా కర్ణాటకలో నిరసనలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమ ప్రాంతానికి చెందని వ్యక్తిని ఎలా బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తారని, ఆ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని పలువురు ప్రభుత్వానికి సూచించారు. అయినా సరే ప్రభుత్వం ఎనక్కి తగ్గలేదు. తమన్నానే బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తూ తాజాగా ఆమెతో కాంట్రాక్ట్‌ని కుదుర్చుకోవడం విశేషం.

## స్వయంభూ టీజర్ అద్భుతం

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా స్వయంభూపై ఆడియన్స్ లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ సినిమాలో సంయుక్త మీనన్, నభా నటేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్ పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఆ మూవీ.. సమ్మర్ కానుకగా ఏప్రిల్ 10న విడుదల కానుంది. అయితే రిలీజ్ కు ముందు వరుస అప్డేట్స్ తో మంచి బజ్ క్రియేట్ చేస్తున్న స్వయంభూ మేకర్స్.. తాజాగా టీజర్ ను విడుదల చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారిన టీజర్.. అందరినీ ఆకట్టుకుంటోంది. అదిరిపోయే విజువల్స్.. గ్రాండ్ మేకింగ్ తో సినీ ప్రియులను మెప్పిస్తోంది. ఇప్పటికే నిఖిల్ చెప్పినట్లు.. న్యాయపరమైన పాలనకు సింబల్ గా నిలిచే రాజదండం సెంగోల్ చుట్టూ మూవీ సాగుతుందని టీజర్ ద్వారా క్లారిటీ వచ్చింది.




## సంయుక్త చేతికి గాయం..

మలయాళ ముద్దుగుమ్మ సంయుక్త మీనన్ ప్రస్తుతం టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది. ఇటీవల అఖండ–2, నారి నారి నడుమ మురారి వంటి చిత్రాలతో వరుస విజయాలను తన ఖాతాలో వేసుకున్న సంయుక్త, ఇప్పుడు నిఖిల్ సిద్ధార్థ్ సరసన 'స్వయంభు'అనే ప్రతిష్టాత్మక చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా ఏప్రిల్ 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈక్రమంలో.. తాజాగా 'స్వయంభు' టీజర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది.



## ఆలియా శపథం

సీనియర్ భామల నుంచి ఎంత పోటీ ఉన్నావాళ్లందర్నీ దాటుకుని మరీ ఆలియా భట్ అవకాశాలు అందుకుంటోంది. వాళ్లను మించిన సక్సెస్‌ను చూస్తోంది. కెరీర్ పీక్స్ లో ఉండగానే లవ్ , ఫ్యామిలీ జీవితానికీ అంతే ప్రాధాన్యతనిచ్చింది. రణబీర్ కపూర్‌తో ప్రేమ వివాహం, పిల్లల విషయంలో ఆలస్యం చేయకుండా వేగంగా పనికానిచ్చేసింది. డార్లింగ్, జిగ్రా సినిమాలతో నిర్మాణ బాధ్యతలు చేపట్టినా నష్టాలే మిగిలాయి. అయితే, హ్యాట్రిక్ ఫ్లాప్ కి ఎంత మాత్రం ఛాన్స్ ఇవ్వనంటోంది. తర్వాత తానే సినిమా నిర్మించిన హిట్ ఇచ్చి కొత్త చరిత్ర రాస్తానంటోంది. ఇంత వరకూ రెండు వైఫల్యాల నుంచి చాలా విషయాలు తెలుసుకున్నానని, నిర్మాతల ఇబ్బం దులు కూడా ఎలా ఉంటాయి అన్నది రెండు ఫ్లాప్ లతో తనకు బాగా అర్థమైందంది. ప్రస్తుతం అలియాభట్ ఆల్ఫాలో నటిస్తోంది.







## నెట్స్‌లో గాయపడిన ఇషాన్ కిషన్

బుమ్రా యార్కర్ కాలికి తగలడంతో తీవ్ర నొప్పి

ఫిజియోల పర్యవేక్షణ తర్వాత మళ్లీ నెట్స్‌లోకి

అభిషేక్ శర్మ ఫిట్‌నెస్‌పై అనుమానంతో సంజూకు చాన్స్?

# నేడు నమీబియాతో టీమిండియా ఢీ

నమీబియాతో గురువారం జరగనున్న మ్యాచ్‌కు ముందు టీమిండియాలో గాయం కలకలం రేపింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఐచ్ఛిక ప్రాక్టీస్ సెషన్‌లో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వేసిన ఓ యార్కర్, వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కాలికి బలంగా తాకింది. దీంతో అతను తీవ్రమైన నొప్పితో విలవిల్లాడుతూ నెట్స్ నుంచి బయటకు వచ్చాడు.

ప్రాక్టీస్‌లో భాగంగా బుమ్రా, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్ బౌలింగ్‌ను ఇషాన్ ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలో బుమ్రా వేసిన ఓ వేగవంతమైన యార్కర్ నేరుగా ఇషాన్ ఎడమ పాదాన్ని తాకడంతో అతను నొప్పితో కింద కూర్చుండిపోయాడు. వెంటనే స్పందించిన జట్టు ఫిజియోలు, సహాయక సిబ్బంది హుటాహుటిన అతని వద్దకు చేరుకుని షూ, ప్యాడ్ తొలగించి గాయాన్ని పరిశీలించారు.



బౌలింగ్ కోచ్ మోర్న్ మోర్కెల్ కూడా పరిస్థితిని సమీక్షించాడు. కొద్దిసేపటి తర్వాత, ఇషాన్ కుంటుతూ నడిచేందుకు ప్రయత్నించాడు. గాయం తీవ్రమైనది కాదని భావించడంతో, మళ్లీ ప్యాడ్లు కట్టుకుని కొన్ని బంతులు ఆడాడు. అయితే, కాస్త ఇబ్బందిగా కనిపించడంతో కొద్దిసేపటికే నెట్స్ వీడి డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయాడు. ఇది ముందుజాగ్రత్త చర్యనా లేక సహచర ఆటగాడు సంజూ శాంసన్‌కు బ్యాటింగ్ అవకాశం ఇచ్చేందుకా అనే దానిపై స్పష్టత రాలేదు. ఇప్పటికే కడుపు నొప్పితో ఆసుపత్రిలో చేరి డిశ్చార్జ్ అయిన అభిషేక్ శర్మ ఫిట్‌నెస్‌పై అనుమానాలు ఉన్నాయి. ఒకవేళ అతను అందుబాటులో లేకపోతే సంజూ శాంసన్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలున్నాయి. కాగా, ఈ ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్‌కు సూర్యకుమార్ యాదవ్ హాజరై భారీ షాట్లు ప్రాక్టీస్ చేయగా.. అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా, అర్ష్‌దీప్ సింగ్, శివమ్ దూబే, మహమ్మద్ సిరాజ్ దూరంగా ఉన్నారు. ఢిల్లీలో సాయంత్రం వేళ మంచు ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, దాన్ని ఎదుర్కొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గ్రౌండ్ సిబ్బంది తెలిపారు.

## అభిషేక్ డిశ్చార్జి.. కానీ!

భారత క్రికెట్ అభిమానులకు టీమిండియా స్టార్ బ్యాటర్, తెలుగు తేజం తిలక్ వర్మ గుడ్ న్యూస్ చెప్పాడు. అనారోగ్యంతో ఆసుపత్రి పాలైన విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ కోలుకున్నాడని తెలిపాడు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడని, ప్రస్తుతం కోలుకుంటున్నాడని చెప్పాడు. గురువారం నమీబియాతో జరిగే మ్యాచ్‌లో ఆడేది లేనిది అతని ఆరోగ్య స్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశాడు. 'ఢిల్లీకి వచ్చాక అభిషేక్ శర్మను పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకెళ్లాం. అతను ఈరోజే డిశ్చార్జ్ అయ్యాడు. ప్రస్తుతం బాగానే ఉన్నాడు. మ్యాచ్‌కు మరో రోజు సమయం ఉంది కాబట్టి, అతని పరిస్థితిని బట్టి టీమ్‌మేనేజ్‌మెంట్ తుది నిర్ణయం తీసుకుంటుంది. బుమ్రా ఇప్పుడు పూర్తి ఫిట్‌గా ఉన్నాడు. అతని ఆరోగ్యం మెరుగ్గా ఉంది. మేనేజ్‌మెంట్ అతని విషయంలో నిర్ణయం తీసుకుంటుంది. రేపటి మ్యాచ్‌కు అతను అందుబాటులో ఉంటాడని అనుకుంటున్నా. పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడటానికి మేం సిద్ధంగా ఉన్నాం. పాక్‌తో మ్యాచ్ జరగబోతోందని మాకు ఒక రోజు ముందే తెలిసింది. మేం ఆడటానికి సిద్ధంగా ఉన్నాం. ఇతర జట్ల ఆటతీరును గమనిస్తున్నాం. బౌలర్లు, బ్యాటర్లను నిశితంగా చూస్తున్నాం. ఆటగాళ్లందరూ టీమ్ సభ్యులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పుడు మేం మ్యాచ్ మోడ్‌లోకి వచ్చేశాం. మా ప్రణాళికలను ప్రారంభిస్తాం.'అని తిలక్ వర్మ పేర్కొన్నాడు.



## ఐర్లాండ్‌పై ఆస్ట్రేలియా గెలుపు

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. గ్రూప్–బీలో భాగంగా కొలంబో వేదికగా ఐర్లాండ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 67 పరుగుల తేడాతో విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నాథన్ ఎల్లిస్(4/12) సంచలన బౌలింగ్‌తో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులు చేసింది. మార్కస్ స్టోయినీస్(29 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 45), మ్యాట్ రేన్‌షా(33 బంతుల్లో 2 ఫోర్లతో 37), జోష్ ఇంగ్లిస్(17 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 37) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్(2/44) రెండు వికెట్లు తీయగా.. మాథ్యూ హంఫ్రేస్, జార్జ్ డాక్‌రెల్, హ్యారీ టెక్టర్ తలో వికెట్ తీసారు. అనంతరం ఐర్లాండ్ 16.5 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌటైంది. జార్జ్ డాక్‌రెల్(29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 41) ఒక్కడే ఒంటరిపోరాటం చేయగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో ఆడమ్ జంపా(4/23), నాథన్ ఎల్లిస్(4/12) నాలుగేసి వికెట్లు తీయగా.. మాథ్యూ కుహ్నెమన్ ఒక వికెట్ పడగొట్టాడు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. డేంజరస్ బ్యాటర్ ట్రావిస్ హెడ్(6) రెండో ఓవర్‌లోనే రనౌటయ్యాడు. దాంతో క్రీజులోకి వచ్చిన కామెరూన్ గ్రీన్(21), జోష్ ఇంగ్లిస్(37) దూకుడుగా ఆడారు. కానీ భారీ షాట్ ఆడే ప్రయత్నంలో కామెరూన్ గ్రీన్ క్యాచ్ ఔచిట్‌గా వెనుదిరిగాడు. దాంతో పవర్ ప్లేలో ఆసీస్ 2 వికెట్లకు 64 పరుగులు చేసింది. జోష్ ఇంగ్లిస్, మ్యాట్ రేన్‌షా కూడా వెనుదిరిగ్గా.. మార్కస్ స్టోయినీస్ దూకుడుగా ఆడాడు. హాఫ్ సెంచరీ ముంగిట అతను ఔట్ కావడంతో ఆసీస్ 182 పరుగులకే ఆలౌటైంది. అనంతరం ఐర్లాండ్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. జార్జ్ డాక్‌రెల్(41) ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. అతను కూడా ఔటవ్వడంతో ఐర్లాండ్‌కు ఘోర పరాజయం తప్పలేదు. గ్రూప్–బీలో రెండు మ్యాచ్‌లకు రెండు ఓడిన ఐర్లాండ్.. సూపర్ 8 అవకాశాలను చేజార్చుకుంది.





# డబుల్ సూపర్ ధమాకా!

### రంజుగా టీ20 వరల్డ్ కప్

### అఫ్ఘాన్–సౌతాఫ్రికా మ్యాచ్‌లో రెండు సూపర్ ఓవర్లు

### రెండో సూపర్ ఓవర్లో సౌతాఫ్రికా విజయం

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో సౌతాఫ్రికా సంచలన విజయాన్ని అందుకుంది. ఉత్కంఠకే ఊపిరి అందని మ్యాచ్‌లో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్–డీలో భాగంగా అహ్మదాబాద్ వేదికగా అఫ్ఘనిస్థాన్‌తో జరిగిన తమ రెండో లీగ్ మ్యాచ్‌లో సౌతాఫ్రికా డబుల్ సూపర్ ఓవర్‌లో గెలుపొందింది. పొట్టి ప్రపంచకప్ చరిత్రలోనే ఈ ఫీట్ సాధించిన తొలి జట్టుగా సఫారీ టీమ్ చరిత్రకెక్కింది. ఆసాంతం ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల స్కోర్లు టై కాగా.. సూపర్ ఓవర్ ద్వారా ఫలితాన్ని తేల్చాల్సి వచ్చింది. సూపర్ ఓవర్‌లో కూడా స్కోర్లు టై కావడంతో డబుల్ సూపర్ ఓవర్ ఆడించాల్సి వచ్చింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 187 పరుగులు చేసింది. క్వింటన్ డికాక్(41 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 59), ర్యాన్ రికెల్టన్(28 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 61) హాఫ్ సెంచరీలతో రాణించారు. అఫ్గాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్(3/41) మూడు వికెట్లు తీయగా.. రషీద్ ఖాన్(2/28) రెండు వికెట్లు పడగొట్టాడు. ఫజలక్ ఫరూఖీ ఒక వికెట్ తీసాడు. అనంతరం అఫ్గానిస్థాన్ 19.4 ఓవర్లలో సరిగ్గా 187 పరుగులకే ఆలౌటైంది. రెహ్మానుల్లా గుర్బాజ్(42 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్స్‌లతో 84) తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. ఆఖరి ఓవర్‌లో అఫ్గానిస్థాన్ విజయానికి 13 పరుగులు అవసరం కాగా.. రబడా వరుసగా నోబాల్, వైడ్ వేసాడు. రెండో బంతిని నూర్ అహ్మద్ సిక్సర్ తరలించగా.. నాలుగో బంతిని మరో నోబాల్ వేసాడు. ఈ బంతికి మూడు పరుగులు వచ్చాయి. దాంతో చివరి రెండు బంతుల్లో 2 పరుగులు అవసరం కాగా.. నాలుగో బంతికి సింగిల్ తీసిన అనంతరం డబుల్ తీసే ప్రయత్నంలో ఫజలక్ ఫరూఖీ రనౌటయ్యాడు. దాంతో స్కోర్లు సమమయ్యాయి. లుంగి ఎంగిడి వేసిన తొలి సూపర్ ఓవర్‌లో అఫ్గాన్ 17 పరుగులు చేయగా.. సౌతాఫ్రికా కూడా సరిగ్గా 17 పరుగులే చేసింది. ఫజలక్ ఫరూఖి వేసిన ఈ ఓవర్‌లో బ్రెవిస్ సిక్స్ బాది ఔటవ్వగా.. స్టబ్స్ ఫోర్‌తో పాటు ఆఖరి బంతికి సిక్స్ బాది స్కోర్లు సమం చేశాడు. రెండో సూపర్ ఓవర్‌లో అజ్మతుల్లా బౌలింగ్‌లో స్టబ్స్ ఒక సిక్స్, మిల్లర్ రెండు సిక్స్‌లతో సౌతాఫ్రికా 23 పరుగులు చేసింది. అఫ్గానిస్తాన్ మాత్రం 19 పరుగులే చేసి ఓటమిపాలైంది. కేశవ్ మహారాజ్ వేసిన ఈ ఓవర్‌లో గుర్బాజ్ వరుసగా మూడు సిక్స్‌లు బాదినా ఫలితం లేకపోయింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే డబుల్ సూపర్ ఓవర్ ద్వారా విజయం సాధించిన తొలి జట్టుగా సౌతాఫ్రికా చరిత్రకెక్కింది.

### ఇది మా ఆట కాదు: మార్క్రమ్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా అఫ్గానిస్థాన్‌తో ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో డబుల్ సూపర్ ఓవర్‌లో గట్టెక్కినా తమ ఆట తీరుపై సౌతాఫ్రికా కెప్టెన్ ఎయిడెన్ మార్క్రమ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఉత్కంఠ పోరులో గెలిచినందుకు సంతోషంగా ఉన్నా.. తమ ఆట మెరుగుపడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు. ఒత్తిడిని జయించి విజయం సాధించడం సంతోషంగా ఉన్నా.. జట్టు ఆట తీరు మెరుగుపడాల్సి ఉందని అభిప్రాయపడ్డాడు. 'ఈ టోర్నీలో ప్రత్యర్థి జట్లు విపరీతమైన ఒత్తిడిని పెంచుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో మనకు మనం ఒత్తిడికి గురైతే పరిస్థితి మరింత కష్టమవుతుంది.ఈ మ్యాచ్‌లో కొన్ని విభాగాల్లో మేం అత్యుత్తమంగా ఆడలేదు. కానీ అది ఒక విధంగా ఉత్సాహాన్నిచ్చే విషయమే. ఎందుకంటే మేము ఇంకా మెరుగుపడటానికి అవకాశం ఉందని అర్థమవుతోంది. ఏదేమైనా, ఈ విజయంతో లభించిన పాయింట్లను అదృష్టంగా భావిస్తున్నా.' అని పేర్కొన్నాడు.

## రూథర్‌ఫర్డ్ విధ్వంసం

**ఇంగ్లండ్‌పై వెస్టిండీస్ విన్**

**భారీ ఛేదనలో తడబడిన ఇంగ్లండ్**

**ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెరిసిన రోస్టన్ చేజ్**

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ 30 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ (76లి) ఆకాశమే హద్దుగా చెలరేగడం, ఆ తర్వాత బౌలర్లు సమష్టిగా రాణించడంతో కరీబియన్ జట్టు సునాయాసంగా గెలిచింది. 197 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు ఓపెనర్ ఫిల్ సాల్ట్ (14 బంతుల్లో 30) మంచి ఆరంభాన్నిచ్చాడు. అయితే, పవర్ ప్లే తర్వాత విండీస్ బౌలర్లు పట్టు బిగించారు. ముఖ్యంగా స్పిన్నర్లు గుడాకేశ్ మోతీ (3/33), రోస్టన్ చేజ్ (2/29) వరుస విరామాల్లో వికెట్లు తీసి ఇంగ్లండ్ మిడిల్ ఆర్డర్‌ను దెబ్బతీశారు. ఒకవైపు వికెట్లు పడుతున్నా శామ్



కరన్ (30 బంతుల్లో 43లి) ఒంటరి పోరాటం చేశాడు. కానీ, అతనికి సహకారం కరవవడంతో ఇంగ్లండ్ 19 ఓవర్లలో 166 పరుగులకే ఆలౌట్ అయి ఓటమిని చవిచూసింది. అంతకుముందు, టాస్ గెలిచిన ఇంగ్లండ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన వెస్టిండీస్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కేవలం 8 పరుగులకే ఓపెనర్లు షై హోప్ (0), బ్రాండన్ కింగ్ (1) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో రోస్టన్ చేజ్ (34) కాసేపు నిలదొక్కుకున్నా, అసలు సిసలు విధ్వంసం షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ నుంచి వచ్చింది. కేవలం 42 బంతుల్లో 2 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 76 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతనికి చివర్లో జాసన్ హోల్డర్ (17 బంతుల్లో 33) మెరుపు ఇన్నింగ్స్ తోడవడంతో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్, జేమీ ఓవర్టన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

# అక్షరమే ఆయుధమైతే.. వందేమాతరం!



**భారత** స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో ఒక పాట కోట్లాది మందిని ఏకం చేసి, అగ్నిపర్వతంలా రగిలించిందంటే అది ఒక్క వందేమాతరం మాత్రమే. అక్షరానికి ఆయుధమంత శక్తి ఉంటుందని, ఒక నినాదం సామ్రాజ్యాలను గడగడలాడించగలదని నిరూపించిన గీతం.. వందేమాతరం. 1875 నవంబర్ 7న బంకించంద్ర ఛటర్జీ కలం నుండి జాలువారిన ఈ అద్భుత కావ్యం కేవలం మాతృభూమి వర్ణన కాదు, అది అణచివేతకు గురవుతున్న ఒక జాతి ఆత్మఘోష మరియు ఆత్మగౌరవ ప్రకటన. సంస్కృత, బెంగాలీ పదాల కలయికతో రూపొందిన ఈ గీతాన్ని ఆయన తన ప్రసిద్ధ నవల ఆనందమఠ్ (1882)లో చేర్చారు. సుజలాం సుఫలాం మలయజ శీతలాం.. అంటూ సాగే పదాలు భరతమాత సౌందర్యాన్ని, సమృద్ధిని కళ్లకు కట్టినట్లు చూపిస్తాయి. వందేమాతరం కేవలం సాహిత్యంలా మిగిలిపోలేదు. 1905 నాటి బెంగాల్ విభజన సమయంలో ఇది ఒక మహా ఉద్యమంగా ఎగసిపడింది. 1896లో రవీంద్రనాథ్ ఠాగూర్ భారత జాతీయ కాంగ్రెస్ వేదికపై దీనిని ఆలపించడంతో ఇది దేశవ్యాప్త గుర్తింపు పొందింది. ఈ నినాదం వింటేనే బ్రిటిష్ పాలకులు వణికిపోయేవారు. వందేమాతరం అనడాన్ని వారు నేరంగా భావించి నిషేధించారంటే, ఆ పదంలో ఎంతటి ప్రేరణ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఖుదీరామ్ బోస్, భగత్ సింగ్ వంటి వీరులు ఉరికంభం ఎక్కుతూ నోరారా పలికిన చివరి పదం 'వందేమాతరం'. 'నేను నీకు నమస్కరిస్తున్నాను తల్లీ' అని అర్థం వచ్చే ఈ గీతం, దేశాన్ని ఒక దేవతగా, మాతృమూర్తిగా కొలిచే భారతీయ సంస్కృతికి నిదర్శనం. జాతి, కుల, మత విభేదాలకు అతీతంగా భారతీయులందరినీ ఏకతాటిపైకి తెచ్చిన ఏకైక భావోద్వేగ మంత్రం ఇది. ఆధ్యాత్మిక శక్తిని, దేశభక్తిని రంగరించి రాసిన ఈ జాతీయ గేయం ప్రతి భారతీయుడిలో స్వదేశీ స్ఫూర్తిని రగిలిస్తుంది. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత కూడా వందేమాతరం తన ప్రాభవాన్ని కోల్పోలేదు. 1950 జనవరి 24న దీనికి జాతీయ గీతంతో సమానమైన హోదాను కల్పించారు. నేటి తరం యువతకు ఈ గీతం కేవలం సంప్రదాయం కాదు, అది మన మూలాలు, మన పూర్వీకుల బలిదానాలు, భవిష్యత్ భారత నిర్మాణానికి మార్గదర్శనం. వందేమాతరం అంటే కేవలం రెండు పదాలు కావు; అది ఒక జాతి శ్వాస, ఒక గొప్ప సంస్కృతి సంకేతం. అజేయమైన భారత జాతీయతకు నిలువుటద్దం. మనమందరం ఆ స్ఫూర్తిని గుండెల్లో నింపుకుని 'ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్' దిశగా అడుగులు వేయడమే ఈ గీతానికి మనం ఇచ్చే నిజమైన నివాళి.

*- ఈవార్తలు సంపాదకీయ విభాగం*

# హైడ్రా.. అక్రమార్కులకు హైరానా!

హైదరాబాద్ మహానగరం విశ్వనగరంగా ఎదుగుతున్న క్రమంలో, అక్రమ కట్టడాలు మరియు చెరువుల ఆక్రమణలు శాపంగా మారాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం 'హైడ్రా'ను ఒక శక్తివంతమైన అస్త్రంగా రంగంలోకి దించింది. కేవలం విపత్తుల నిర్వహణకే పరిమితం కాకుండా, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ మరియు ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా ఏర్పడిన ఈ సంస్థ, గత కొద్ది నెలలుగా వార్తల్లో నిలుస్తోంది. దశాబ్దాలుగా హైదరాబాద్‌లో ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో అడ్డగోలుగా వెలిసిన అక్రమ నిర్మాణాలు నగరాన్ని ముంచెత్తుతున్నాయి.




**స్వల్ప** వర్షానికే కాలనీలు చెరువులను తలపిస్తుండటం, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం కావడానికి ప్రధాన కారణం కబ్జాలే. వీటిని అరికట్టడానికి ఉన్న పాత వ్యవస్థలు (మున్సిపాలిటీ, రెవెన్యూ) రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నాయన్న విమర్శల నేపథ్యంలో, ఒక స్వతంత్ర మరియు శక్తివంతమైన ఏజెన్సీగా హైడ్రా అవతరించింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో జరిగిన కూల్చివేతలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. బడా రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు, వ్యాపారవేత్తల ఫామ్ హౌస్‌లను సైతం వదలకుండా కూల్చివేయడం ద్వారా "చట్టం ముందు అందరూ సమానమే" అనే సందేశాన్ని హైడ్రా పంపింది. గండిపేట, హిమాయత్ సాగర్ వంటి ప్రధాన జలాశయాల పరిరక్షణలో హైడ్రా పోషిస్తున్న పాత్ర కీలకం. సామాన్య ప్రజల నుంచి హైడ్రాకు మిశ్రమ స్పందన లభించింది. ఒకవైపు ఆక్రమణలు తొలగుతున్నాయని హర్షం వ్యక్తం అవుతుండగా, మరోవైపు నోటీసులు లేకుండా కూల్చివేస్తున్నారనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. హైడ్రా పనితీరుపై హైకోర్టు పలు సందర్భాల్లో కీలక వ్యాఖ్యలు చేసింది. కూల్చివేతలకు ముందు సరైన నోటీసులు ఇవ్వాలని, సహజ న్యాయ సూత్రాలను పాటించాలని కోర్టు హెచ్చరించింది. మున్సిపల్, రెవెన్యూ చట్టాల పరిధిని హైడ్రా అతిక్రమిస్తోందన్న వాదనలపై స్పష్టత రావాల్సి ఉంది. హైడ్రా కేవలం ప్రతిపక్ష నాయకులనే లక్ష్యంగా చేసుకుంటోందని బీఆర్ఎస్, బీజేపీ ఆరోపిస్తున్నాయి. హైడ్రా అంటే హైడ్రామా అని ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి. ముఖ్యంగా పేదల ఇళ్లను కూల్చివేయడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీనికి సమాధానంగా, హైడ్రా కేవలం కమర్షియల్ కట్టడాలు, బడా ఆక్రమణలకే ప్రాధాన్యం ఇస్తుందని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అయితే, హైడ్రా సుదీర్ఘకాలం విజయవంతం కావాలంటే కొన్ని కీలక మార్పులు అవసరం. ఏ ప్రాతిపదికన ఒక నిర్మాణాన్ని అక్రమంగా గుర్తిస్తున్నారో ప్రజలకు స్పష్టంగా వివరించాలి. నిర్మాణం పూర్తయ్యాక కూల్చడం కంటే, అనుమతుల దశలోనే అక్రమాలను అడ్డుకోవడం మేలు. అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చిన నాటి అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలి. అప్పుడే వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుంది. హైడ్రా అనేది కేవలం ఒక కూల్చివేతల యంత్రం కాదు, అది ఒక వ్యవస్థీకృత మార్పుకు సంకేతం. ఆక్రమణల చెరలో ఉన్న నగరాన్ని కాపాడటానికి ఇటువంటి కఠిన నిర్ణయాలు అవసరమే అయినప్పటికీ, అవి మానవీయ కోణంలో, చట్టబద్ధంగా సాగాలి.

**- వీరేశం సంగనభట్ల, హైదరాబాద్ (బషీర్‌బాగ్)**




తెలంగాణలో స్థానిక సంస్థల సమరం ముగిసింది. అటు పల్లెల్లో పంచాయతీ ఎన్నికలు, ఇటు పట్టణాల్లో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చ అంతా ప్రజా పాలనపైనే నెలకొంది. ఎన్నికల కోడ్ అడ్డంకులు తొలగిపోవడంతో, ఇకనైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో నెరవేరుస్తుందా? అనే ప్రశ్నలు ప్రజల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 11న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ ముగియడంతో రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా సాగిన ఎన్నికల వాతావరణం సద్దుమణిగింది.

# ప్రజాపాలన ఇంకెప్పుడు?

అంతకుముందు డిసెంబర్ 2025లో జరిగిన పంచాయతీ ఎన్నికలతో పల్లెలు కొత్త పాలకవర్గాలను ఎన్నుకున్నాయి. ఈ ఎన్నికల వల్ల అభివృద్ధి పనులకు బ్రేక్ పడిందని, నిధుల విడుదల నిలిచిపోయిందని సామాన్యులు భావిస్తున్నారు. ఇప్పుడు ఎన్నికల సందడి తీరడంతో ప్రభుత్వం తన పూర్తి దృష్టిని ప్రజా పాలన, అభివృద్ధిపై కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 'ఆరు గ్యారెంటీలు' ప్రజల్లో భారీ అంచనాలను పెంచాయి. ప్రజలకు అవసరం లేని మహాలక్ష్మి పథకం (ఆర్టీసీ బస్సు పథకం)తో పాటు 200 యూనిట్ల గృహ జ్యోతి పథకం అమలు అవుతున్నాయి. అయితే, అర్హులైన మహిళలకు నెలకు రూ.2,500 ఇచ్చే పథకం ఇంకా పూర్తిస్థాయిలో పట్టాలెక్కాల్సి ఉంది. వృద్ధాప్య పింఛన్లను రూ.4,000కు పెంచుతామన్న హామీపై లబ్ధిదారులు వేచి చూస్తున్నారు. ఎకరానికి రూ.15,000 చొప్పున పెట్టుబడి సాయం అందజేతపై రైతుల్లో ఉత్కంఠ నెలకొంది. అదీకాక, మేజర్ పంచాయతీలకు రూ.10 లక్షలు, చిన్న పంచాయతీలకు రూ.5 లక్షల చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధులను ముఖ్యమంత్రి ప్రకటించారు. కానీ, ఇప్పటి వరకు దాని ఊసేలేదు. పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి వేల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రులు తెలుపుతున్నారు. నిజామాబాద్ వంటి జిల్లాల్లో రూ.600 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయి. వాటి నిర్మాణాలు జరగాలి, విద్యార్థులకు అందుబాటులోకి రావాలి. ఇప్పటికైతే, ఎన్నికల కోడ్ ముగియడంతో, ఇకపై సాకులు చెప్పే అవకాశం ప్రభుత్వానికి ఉండదు. ప్రజా పాలన పేరుతో క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరిస్తారా? లేదా? అనేది రాబోయే కొన్ని నెలల పాలన నిర్ణయించనుంది. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి, ఎన్నికల మేనిఫెస్టోను ఆచరణలోకి తెస్తేనే ప్రభుత్వానికి ప్రజల్లో అసలైన ఆదరణ దక్కుతుంది.



**- శశిధర్ అక్కెల**

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.